

పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ స్టాంప్‌లు, పేపర్లు (ఫైల్)

సిట్ మళ్లీ తెరపైకి వస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించాక దానిని పునరుద్ధరించే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో నకిలీ పత్రాలు సృష్టించి రూ.కోట్ల విలువ చేసే ప్రైవేటు, ప్రభుత్వ భూములను ఆక్రమించారు. వాటిని అమాయకులకు అమ్మేసి భారీగా సొమ్ము చేసుకున్నారు. ముఖ్యంగా ఒంగోలు ప్రాంతంలో అత్యంత విలువైన భూములు కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కుకుపోయాయి. రాజకీయ నాయకుల నుంచి ఉన్నతాధికారుల వరకూ అనేక మంది భూబకాసురుల బాధితులుగా ఉండి విలవిల్లాడుతున్నారు. జరిగిన అక్రమాలపై గత ప్రభుత్వ హయాంలో వేసిన సిట్ దర్యాప్తు సక్రమంగా జరగలేదు. వైసీపీ నాయకుల అండదండలు ఉండటంతో సూత్రధారులను వదిలేసి కేవలం పాత్రధారులను జైలుపాల్జేశారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి వారిపై ఇప్పుడు ఉక్కుపాదం మోపేందుకు రంగం సిద్ధమవుతోంది.



మళ్లీ సిట్!

- ఆ దిశగా అడుగులు
- ఒంగోలులో వైసీపీ నాయకులు రూ.101 కోట్ల ఆస్తులు కొట్టేశారన్న సీఎం
- విచారణ చేయిస్తామని అధికారిక ప్రకటన
- నకిలీ పత్రాలతో పెద్దఎత్తున భూములు కబ్జా
- వేలాది మంది బాధితులు ఇప్పటికే ఫిర్యాదు
- పలు కేసులు నమోదు.. తర్వాత చర్యలు కరువు
- నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తాం
- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం
- పోలీసు శాఖలోనూ ఇదే హాట్‌టాపిక్

ఒంగోలు(క్రైం), జూలై 16 : నకిలీ పత్రాలతో భూఅక్రమాలకు పాల్పడిన వారికి వణుకు పుట్టించే వార్త. సిట్‌ను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన అందుకు ఊతమిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తోంది. ఈనేపథ్యంలో సోమవారం సహజ వనరుల దోపిడీపై శ్వేతపత్రాన్ని చంద్రబాబు విడుదల చేశారు. ఒంగోలులో రూ.101 కోట్ల విలువైన ఆస్తులను కొట్టేశారని అందులో పేర్కొన్నారు. వైసీపీకి చెందిన నాయకులు, సానుభూతిపరులు, కొందరు అధికారులు కలిసి నకిలీపత్రాలు సృష్టించి ప్రైవేటు, ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని సీఎం నేరుగా పేర్కొన్నారు. ఇలాంటి వారిని విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కూడా ఇటీవల అనేకమార్లు భూబాగోతాలపై మళ్లీ సిట్ వేసి విచారణ చేయిస్తామని, బాధితులకు తిరిగి భూములు ఇప్పిస్తామని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ కూడా తిరిగి సిట్ వేసి భూకుంభకోణంలో ఉన్న పెద్ద తలకాయలను బయటపెట్టి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. ఇలా మొత్తంగా ఒంగోలులో జరిగిన భూకుంభకోణాల వ్యవహారం తిరిగి తెర మీదకు వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ఎస్పీ దామోదర్‌కు భూకుంభకోణమే పెను సమస్యకానుందని చెప్పవచ్చు.

నకిలీ భూకుంభకోణంలో అంతా వైసీపీ నేతలే

గత ఏడాది ఒంగోలులో లాయర్‌పేట ఎక్స్‌టెన్షన్‌లోని ఓ ఇంటిపై పోలీసులు దాడిచేయగా పెద్దమొత్తంలో స్టాంపులు, దస్తావేజులు, రబ్బరు స్టాంపులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాల్సిన సర్టిఫికెట్లు దొరికాయి. దీంతో ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా అనేక విషయాలు వెలుగు చూశాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిట్ ఏర్పాటు చేసి నకిలీపత్రాలు, భూకుంభకోణాలపై విచారణ చేపట్టారు. తీగలాగితే డొంక కదిలినట్లు వైసీపీ నేతల భూదందాలు బయటకొచ్చాయి. వందలాది మంది బాధితులు సిట్ అధికారుల ముందుకొచ్చి ఫిర్యాదులు చేశారు. అయితే వైసీపీ నేతల హస్తం ఉండటంతో ఎక్కువశాతం విచారణ ముందుకు కదల్లేదు. పైగా అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లు కూడా సిట్‌పై బాగా పనిచేశాయన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నకిలీ పత్రాల సూత్రధారులు, భూకబ్జాలకు కారకులు ఎవరనేది తేల్చకుండా, నకిలీపత్రాలు తయారు చేసిన వారు, జిరాక్స్ తీసిన వారు, సాక్షి సంతకాలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారనే విమర్శలు వెల్లువెత్తాయి. వైసీపీ నాయకులపై వచ్చిన ఆరోపణలు పైకి పోకుండా సిట్‌లో పనిచేసిన అధికారులు చక్రంతిప్పి అందిన కాడికి దండుకున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా అక్రమమని తెలియక భూములను కొనుగోలు చేసిన అమాయకులు, వ్యాపారులను బెదిరించి భారీగా వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి.

కొన్ని కేసులలో అడుగుముందుకు పడలేదు

జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతోపాటు గుంటూరు రేంజ్ పరిధిలో ఉన్న అధికారులు సైతం సిట్‌లో పనిచేశారు. ఇప్పటికీ కొంతమంది వద్ద కేసుల విచారణ పెండింగ్‌లోనే ఉండిపోయింది. మూడు నెలలపాటు జిల్లాలో సిట్ పేరుతో పోలీసులు సిరులు పండించుకున్నారు. ముఖ్యంగా తాలూకా స్టేషన్ కేంద్రంగా పండుగ చేసుకున్నారు. ఎన్నికలు దగ్గరపడటంతో సిట్‌ను తాత్కాలికంగా మూసివేసి ఆ విధులకు హాజరయ్యారు. అయితే వైసీపీ నేతలు చేసిన భూకబ్జాల విషయం ఎక్కడా బయటకు రాలేదని అప్పట్లో టీడీపీ నాయకులు బహిరంగ విమర్శలు చేశారు. నకిలీ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన పెద్ద నేత అనుయాయులు కనిపించకుండా పోయారు. పోలీసులు కూడా వైసీపీ నేతలు, వారు సిఫార్సు చేసిన కేసుల విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరించారు. అదేసమయంలో భూఅక్రమాలలో నేరుగా పాత్రధారులైన కొంతమంది వైసీపీ నాయకులు నెలల పాటు ఒంగోలు వదిలి వెళ్లిపోయారు. అయితే వారివైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. కాగా గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన కొందరు అధికారులు అక్రమార్కులకు ముందే అన్ని విషయాలు తెలిపి, ఒంగోలు నుంచి పంపివేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది.

సిట్ తెరిస్తే ఎలా..?


గత ఐదారు రోజులుగా సిట్ వ్యవహారం నగరంలో చర్చనీయాంశమైంది. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల పదేపదే అక్రమార్కుల అంతుతేలుస్తానంటూ సీరియస్‌గా ప్రకటనలు చేస్తున్నారు. అలాగే పోలీసు అధికారులూ మారిపోతున్నారు. నూతన అధికారులు కొలువుదీరితే సిట్‌ను పునరుద్ధరించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈనేపథ్యంలో గత ప్రభుత్వంలో రెచ్చిపోయిన అక్రమార్కుల వెన్నులో వణుకు పుడుతోంది. ముఖ్యంగా ఆ కుంభకోణంలో ఉన్న వైసీపీ కీలక నేతలు, ప్రజాప్రతినిధులు విచారణ జరిగితే తమ పరిస్థితి ఏమిటన్న ఆలోచనలో పడినట్లు సమాచారం. ఇదే విషయం పోలీసు శాఖలోనూ చర్చనీయాంశమైంది. ఈనేపథ్యంలో నూతనంగా బాధ్యతలు తీసుకోనున్న ఎస్పీ దామోదర్ సిట్ వ్యవహారం, కేసులు విచారణ తీరుపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

రూ.101 కోట్లు!

ఒంగోలులో ఆక్రమణకు గురైన భూముల విలువ ఇదీ

- వైసీపీ పాలనలో అక్రమాలపై శ్వేతపత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- గ్రానైట్ క్వారీలలో తనిఖీల విషయం ప్రస్తావన

ఒంగోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో గత వైసీపీ పాలనలో దాదాపు రూ.101 కోట్ల విలువైన భూముల ఆక్రమణలు జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పాలనలో భూములు, గనులు, ఆటవీ, ఇతర సహజవనరుల దోపిడీపై రాష్ట్రప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం శ్వేతపత్రం విడుదల చేశారు. అందులో ఒంగోలులో భూఆక్రమణలు, అక్రమాలు, వైసీపీ నేతల దందాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ సమయంలో వైసీపీ నేతలు రెచ్చిపోయి పెద్దఎత్తున పలుచోట్ల భూకబ్జాలకు పాల్పడ్డారు. ప్రధానంగా విశాఖ, తిరుపతి ప్రాంతాల్లో జరగ్గా అదే కోవలో ఒంగోలులోనూ చోటుచేసుకున్నాయి. ఇదేవిషయాన్ని శ్వేతపత్రంలో సీఎం తెలిపారు. ప్రధానంగా కుటుంబ వివాదాల్లో ఉన్నవి, ఎవరి స్థలం అన్నది స్పష్టం లేని ప్రైవేటు స్థలాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు స్థలాలను వైసీపీ నేతలు గుర్తించి. వాటికి వీలునామాలు, పార్టీషన్ డీడ్లు, కుటుంబసభ్యుల సర్టిఫికెట్లు, డీకే పట్టాలు, జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ, విక్రయ దస్తావేజులు పెద్దఎత్తున నకిలీవి సృష్టించి సివిల్ వివాదాలు వచ్చేలా చేశారన్నారు. గూండాలు, అవినీతి అధికారుల అండదండలతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. అలా సుమారు రూ.101 కోట్ల విలువైన స్థలాలు, భూములు ఒంగోలులో ఆక్రమణలు జరగ్గా వైసీపీ నేతల కారణంగా 112 మంది బాధితులు తమ స్థలాలు, భూములను కోల్పోయినట్లు గుర్తించామన్నారు.



హక్కుదారులకు తిరిగి ఇచ్చేలా చర్యలు

అన్యాక్రాంతమైన స్థలాలు, భూములపై విచారించి వాస్తవ హక్కుదారులకు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చంద్రబాబు వివరించారు. ఈ తరహా భూ ఆక్రమణలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరిన సీఎం.. ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టాన్ని అమల్లోకి తెస్తామన్నారు. అనుకూలురైన వారికి లబ్ధిచేకూరేలా చేసి సహజ వనరులను వైసీపీ వారు దోచుకున్నారని చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర ఖజానాకు నష్టం కలిగించేలా వైసీపీ ప్రభుత్వం చేసిన వాటిలో జిల్లాలోని గ్రానైట్ రంగాన్ని చేర్చారు. వైసీపీ ప్రభుత్వంలో 2019-20 మధ్య ఉమ్మడి జిల్లాలో 115 గ్రానైట్ లీజులు ఉన్న క్వారీలలో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి తమకు అనుకూలంగా లేని 23 క్వారీల వారికి రూ.614 కోట్లు జరిమానాలు విధించి మూతవేయించారన్నారు. మిగతా వారి నుంచి వైసీపీ నేతలు లబ్ధిపొంది వారికి అనుకూలంగా వ్యవహరించారని చంద్రబాబు స్పష్టం చేశారు.

మీ ఇష్టం.. పోతేపోండి!

- ఉంటే మీకోసం పోరాడతా
- కార్పొరేటర్లనుద్దేశించి బాలినేని
- సొంత పార్టీలోనే ఇబ్బందులు పడ్డా



ఒంగోలు (కలెక్టరేట్), జూలై 16 : 'ఉండాలని ఉంటే ఉండండి. లేకుంటే వెళ్లండి. ఉంటే మీకోసం పోరాడతా..' అని పార్టీ మారాలనుకుంటున్న వైసీపీ కార్పొరేటర్లకు మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్లు పార్టీలో ఉంటామని తనకు చెప్పారని తెలిపారు. తనతో ఉంటే వారికి అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. పార్టీ మారాలా? వద్దా? అనేది వారి ఇష్టమని తేల్చి చెప్పారు. తాను భూకబ్జాలకు పాల్పడినట్లు ఎన్నికలకు ముందు ప్రచారం చేశారని, వారి చేతిలోనే ప్రస్తుతం అధికారం ఉన్నందున విచారణ చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేపై తనకు నమ్మకం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు విచారణ చేయించాలని కోరారు. ఒంగోలులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కొనుగోలు చేసిన భూముల విషయంలో రైతుల వద్ద తాను ఒక్క రూపాయి తీసుకున్నానని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. తన కోడలి మీద అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని, తన కొడుకుతో తిరిగే వాళ్లను గంజాయి బ్యాచ్ అంటున్నారన్నారు. తప్పు చేస్తే ఎవ్వరినైనా నిలదీసే మనస్తత్వం తనదన్నారు. వైసీపీ అధినేత జగన్ కరెక్టుగా చేయనప్పుడు ప్రశ్నించానని, దీంతో కొన్ని ఇబ్బందులు పడ్డానని తెలిపారు. సున్నితంగా ఉండే తనను కొంతమంది చికాకు పెడుతున్నారన్నారు. సొంత పార్టీలో కూడా ఇబ్బందులు పడ్డానని, కొంతమంది బయటి వ్యక్తులతో కలిసి పార్టీ వాళ్లే సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేయించారన్నారు. త్వరలో ఆ విషయాలను కూడా బయట పెడతానని తెలిపారు.

డ్వామా పీడీ అవినీతిపై విచారణ

- విచారణాధికారిగా జేసీ నియామకం
- ఉద్యోగుల వినతిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా
- సిబ్బంది రోడ్డెక్కడంతో కార్యాలయానికి రాని అర్జున్‌రావు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 16: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ అర్జున్‌రావు అవినీతిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను నియమించినట్లు సమాచారం. డ్వామా పీడీగా అర్జున్‌రావు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మామూళ్ల కోసం వేధించడంతోపాటు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఉద్యోగులు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. పీడీ కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రం రూపంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమర్పించారు. ఉద్యోగులతో ఆయా అంశాలపై మాట్లాడిన కలెక్టర్ అన్సారియా పీడీ అవినీతికి సంబంధించిన అంశాలపై ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించినట్లు సమాచారం. తమనే కాకుండా కొందరు ఎంపీడీవోలను సైతం వేధించినట్లు ఈ సందర్భంగా వారు వివరించారు. మండలం నుంచి నెలకు రూ.లక్ష మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లేనిపక్షంలో ఆయా ఉద్యోగులను టార్గెట్ చేసి అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ అన్సారియా.. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో సమగ్ర విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా డ్వామాలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేయడం పత్రికల్లో ప్రముఖంగా రావడంతో కలెక్టర్ స్పందించి అందుకు సంబంధించి పీడీ అర్జునరావును వివరణ కోరినట్లు సమాచారం. కాగా తమ శాఖలో పనిచేసే ఉద్యోగులు తనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడంతో మంగళవారం కార్యాలయానికి రాకుండా ఆయన ముఖం చాటేసినట్లు తెలిసింది. ఉద్యోగులు సమావేశమై ఆందోళనలు చేస్తారని తెలిసిన వెంటనే పీడీ అర్జునరావు అన్ని విభాగాల ఉద్యోగుల్లోని ముఖ్యనాయకులతో మాట్లాడినట్లు సమాచారం. ఇక నుంచి అటువంటివి జరగకుండా చూసుకుంటానని, ఆందోళనలు చేయవద్దని కోరినట్లు తెలిసింది. కానీ ఉద్యోగులు ఆయన వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని రోడ్డెక్కడంతో డ్వామా అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

హైస్కూల్ ప్లస్‌లలో బోధన సిబ్బంది నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డీఈవో సుభద్ర వెల్లడి

ఒంగోలు(విద్య), జూలై 16 : జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌లలో బోధన సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టినట్లు డీఈవో సుభద్ర తెలిపారు. 'హైస్కూల్ ప్లస్ ఫెయిల్' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని తొమ్మిది హైస్కూల్ ప్లస్ బాలికా జూనియర్ కళాశాలలకు అవసరమైన మేరకు బోధన సిబ్బందిని నియమించామన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా మంజూరైన 11 కోఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లకు హైస్కూళ్లు, యూపీ స్కూళ్లలో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లు, సబ్జెక్టు టీచర్లలో అర్హులైన వారిని పని సర్దుబాటు విధానంలో నియమించాలని పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలను ఆదేశించామన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగ్‌లు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ విద్యాసంవత్సరమే పంపిణీకి ఎంఈవోలు చర్యలు తీసుకుంటారని డీఈవో చెప్పారు.



గ్రానైట్ పరిశ్రమ సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే బీఎన్‌కు ఓనర్ల అసోసియేషన్ విజ్ఞప్తి



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు బొకేలను అందజేస్తున్న గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

చీమకుర్తి, జూలై 16 : వ్యవసాయం తర్వాత జిల్లాలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం, సమస్యలను పరిష్కరించాలని గ్రానైట్ ఓనర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు విన్నవించుకున్నారు. మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్‌ను అసోసియేషన్ ప్రతినిధులు కలిసి పరిశ్రమలో నెలకొన్న సమస్యల గురించి, గత ప్రభుత్వహయాంలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల కలిగిన కష్టనష్టాల గురించి వివరంగా తెలిపారు. దాదాపు గంటన్నరసేపు సమయం కేటాయించిన విజయ్‌కుమార్ పరిశ్రమలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులపై ఓనర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి ఆదాయం తగ్గకుండా సమస్యలను పరిష్కరించే మార్గాలను అడిగారు. కాగా ఓనర్లు తమ సమస్యలలో ముఖ్యంగా లీజుల రెన్యువల్స్‌లో నెలకొన్న తీవ్రజాప్యం, విజిలెన్స్ తనిఖీలు నిర్వహించిన సమయంలో క్వారీల్లో అశాస్త్రీయంగా తీసిన కొలతలతో విధించిన భారీ పెనాల్టీల వల్ల రెన్యువల్ సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను, వివిధరకాల పేర్లతో విధించిన పన్నులు గురించి వివరించారు. చైనాలో నెలకొన్న సంక్షోభం 90శాతం గ్రానైట్ ఎగుమతి ఆగిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పరిశ్రమకు భరోసా ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని బీఎన్‌కు తెలిపారు. కాగా ఆయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేన్ ప్రధానకార్యదర్శి అజీమ్, శిద్దా సూర్యప్రకాశరావు, చలువాది బదరినారాయణ, శిద్దా సురేష్, శిద్దా భరత్, నవీన్‌రెడ్డి, పల్లవ గ్రానైట్ అధినేత డాక్టర్ శిల్ప, వీటీసీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లక్ష్మీనారాయణ, సుబాస్కరరెడ్డి, చంద్రారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు ఆర్థికసహాయం





ఎమ్మెల్యే దామచర్లకు చెక్కులను అందజేస్తున్న పద్మజ, రవికుమార్‌రెడ్డి, శరత్‌బాబు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 16: ఒంగోలులో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్ల కోసం పలువురు దాతలు ఆర్థికసహాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. గత నెల రోజుల నుంచి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో నగరంలోని నాలుగు అన్నక్యాంటీన్లలో ఉచితంగా అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో పలువురు దాతలు తమవంతు సహకారం అందిస్తున్నారు. కాగా మంగళవారం తెలుగు మహిళ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు రావుల పద్మజ తన వంతుగా రూ.50వేలను ఎమ్మెల్యేకు అందజేశారు. అలాగే చేజర్ల సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి రూ.50వేలు, దేవారెడ్డి శరత్‌బాబు రూ.15వేలు నగదును ఎమ్మెల్యే దామచర్లకు అందజేశారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మద్దిపాడు, జూలై 16: జర్నలిస్టులపై వైసీపీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మద్దిపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, రావి నరసింహారావు, చుండూరి రఘురాం, మండవ గోవిందరాజులు, మండవ గోపీనాథ్, శుద్దపల్లి నరసింహారావు, కడియాల రఘుబాబు, చింతల శ్రీనివాసరావు, దుద్దుకూరి డేవిడ్, బాపట్ల ఆశీర్వాదం, వెల్లంపల్లి సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్, రెబ్బవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 16: ఒంగోలు లోకసభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు తొలిఏకాదశి శుభాకాంక్షలను మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలందరూ తొలిఏకాదశి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

అక్రమ కేసును ఎత్తివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16: వైసీపీ ప్రభుత్వ హయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసును వెంటనే తొలగించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఒంగోలులోని సంఘ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరిన సూర్యనారాయణపై వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా కేసులు పెట్టి అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఆ కేసును ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, ప్రతినిధులు భాను, రంగారెడ్డి, శ్రీనివాసులు, రామన వెంకటేశ్వరరెడ్డి, గురుదేవి, శ్రీకాంత్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, శ్రీదేవి, బేబి, రాజ్‌కుమార్, సురేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్విస్ ఫార్మసీలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న గీతాప్రియదర్శిని

ఒంగోలు(విద్య), జూలై 16: ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. స్థానిక కిమ్స్ హాస్పటల్ ఎండోక్రైన్ వైద్య నిపుణులు గీతా ప్రియదర్శిని మాట్లాడుతూ ఎండోక్రైన్ డిజార్డర్లు ముఖ్యంగా వారసత్వంగా, జీవన విధానంలో మార్పులు వల్ల సంభవిస్తాయన్నారు. సకాలంలో రోగ నిర్ధారణ చేయగలిగితే ఉత్తమ చికిత్స అందించవచ్చని చెప్పారు. అనంతరం పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ ఎం.కిషోర్‌బాబు, కిమ్స్ మేనేజర్ అమరనాథ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ దానమూర్తి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవినీతి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి : జనసేన



మాట్లాడుతున్న జనసేన నాయకులు

సింగరాయకొండ, జూలై 16 : సింగరాయకొండ పంచాయతీలో అవినీతికి పాల్పడిన సర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమె చెక్‌పవర్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. స్థానిక కందుకూరురోడ్డు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. సర్పంచ్ తాటిపర్తి వనజ గత మూడేళ్ల కాలంలో పంచాయతీ నిధులను అడ్డగోలుగా దారిమళ్లించారని ఆరోపించారు. గతంలో డీఎల్పీవో పద్మ చేపట్టిన విచారణలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో కలిసి రూ.45 లక్షలు దుర్వినియోగం చేసినట్లు తేలిందన్నారు. డీఎల్పీవో నివేదిక ఆధారంగా పంచాయతీ కార్యదర్శి శరత్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ టి.శైలజ, కంప్యూటర్ ఆపరేటర్ కె.సురేష్‌ను అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని తన మీద చర్యలు తీసుకోకుండా సర్పంచ్ నిలుపుదల చేసుకున్నారని విమర్శించారు. పంచాయతీలో గత మూడేళ్లుగా జరిగిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కనపర్తి మనోజ్‌కుమార్, ఐనాబత్తిన రాజేష్, శశిభూషణ్, నేతలు కాసుల శ్రీనివాసులు, కిరణ్‌బాబు, సామాజిక కార్యకర్త వసంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సోనాబోట్లతో అక్రమంగా చేపలవేట

పాకలతీరంలో వేటాడుతున్న సోనాబోట్లు

సింగరాయకొండ, జూలై 16 : మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్రతీరంలోకి మంగళవారం చెన్నై రాష్ట్రంలోని కడలూరుకు చెందిన మత్స్యకారులు సోనాబోట్లతో చొరబడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 20 బోట్లలో వేట సాగించారు. దీంతో స్థానిక మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. సోనాబోట్ల ధాటికి తీరంలో తాము నాటుకున్న లక్షల విలువ చేసే వలల తెగిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి సోనాబోట్లను కట్టడి చేయాలని కోరుతున్నారు.

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 16 : ఈనెల 18వ తేది జరగాల్సిన ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్లు మేయర్ గంగాడ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఈ సమావేశాన్ని వాయిదా వేశామని, మరలా ఎప్పుడు నిర్వహించేది నోటీసు ద్వారా సభ్యులకు, కో ఆప్షన్ మెంబర్లకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

హ్యాండ్‌బ్యాగ్‌ను లాక్కెళ్లిన దుండగులు

ఒంగోలు(క్రైం), జూలై16: స్కూటీపై ఇరువురు మహిళలు వెళుతుండగా గుర్తు తెలియని దుండగులు మోటార్‌సైకిల్‌పై వచ్చి వారి వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను లాక్కొని పరారీ అయ్యారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం బాపూజీ కాంప్లెక్స్‌లో జరిగింది. స్థానిక కమ్మపాలెంలో నివాసం ఉండే ఇరువురు మహిళలు షాపింగ్ చేసేందుకు బాపూజీకాంప్లెక్స్ వెళ్లారు. అయితే ఇరువురు దుండగులు మోటార్‌సైకిల్‌పై వచ్చి స్కూటీపై ఉన్న మహిళ వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని వెళ్ళారు. బాగ్‌లో రూ.12వేల నగదు, రూ.లక్ష విలువ చేసే సెల్‌ఫోన్ ఉందని బాధితురాలు తెలిపారు. టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

జీపీఎస్ గజిట్ నిలుపుదలపై హర్షం

ఒంగోలు(విద్య), జూలై 16: ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన జీపీఎస్ గజిట్‌ను నిలుపుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడం పట్ల ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు. జీపీఎస్ జీవోను రద్దు చేయాలని, ఓపీఎస్ అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలుకు చర్యలు తీసుకోకుంటే వాయిదా వేసుకున్న నిరసన కార్యక్రమాలు తిరిగి నిర్వహిస్తామని నాయకులు కేవీజీ.కీర్తి, బి.వెంకట్రావు, ఎ.అమ్మయ్య, బి.అశోక్‌కుమార్, పీవీ.సుబ్బారావు పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

మద్దిపాడు, జూలై 16: కారు ఢీకొన్న సంఘటనలో నాగులుప్పలపాడుకు చెందిన ఆర్.అరుణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మండలంలోని బూరేపల్లికాలనీ సమీపంలో అద్దంకి నుంచి చీరాల వెళ్తున్న కారు అదుపుతప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న అరుణ్‌కుమార్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16 : జిల్లాలో వివిధ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం పలు శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియ ఎక్కడ పూర్తి కాలేదో అక్కడ డ్రైవ్ మోడ్‌లో మ్యూటేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు. కోర్టు కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆర్డీవోలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, ఎస్‌డీసీలు ఝాన్సీలక్ష్మి, వరకుమార్, లోకేశ్వరరావు, డీఎఫ్‌వో శ్రీనివాసులు, డీటీడబ్ల్యువో జగన్నాథరావు, సర్వే అధికారి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకల్పనకు, వ్యవసాయ రంగ అభివృద్ధికి నాబార్డు తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పటిష్టంగా, లాభసాటిగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, నాబార్డు డీడీఎం రవికుమార్, పీడీసీసీబీ సీఈవో కోటిరెడ్డి పాల్గొన్నారు.

చెరువుల ఆధునికీకరణ పూర్తి చేయాలి

జిల్లాలో చేపట్టిన ఇరిగేషన్ కెనాల్స్, చెరువుల ఆధునికీకరణ, మరమ్మతుల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయలో ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా తాగునీటికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుని పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మురళీక్రిష్ణ, ప్రాజెక్ట్ ఎస్ఈ అబుత్‌సలీం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ఒంగోలు(కల్చరల్), జూలై 16: ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా నగరంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ప్రాంగణంలో తెనాలి నేత్రాలయ వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. దాదాపు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్లు అందజేశారు. అదేవిధంగా స్థానిక శివం శరణాలయంలో పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, మాతా శిశు వైద్యశాలలో రోగులకు పండ్లు, దుప్పట్లు అంజేశారు.

90శాతం రాయితీ ఇవ్వాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16 : గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 90శాతం రాయితీతో పాటు యూనిట్ వ్యయం రూ.3 లక్షలకు పెంచాలని ఏపీ గొర్రెలు, మేకలపెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి 90శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్లకు 70శాతం ఇవ్వాలని నిర్ణయించి పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందులో పశువులకు ఎక్కువ రాయితీ, సన్నజీవాలకు తక్కువ రాయితీ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నా మన్నారు. అన్ని రకాల షెడ్లకు అంతే ఖర్చు అవుతుందని తెలిపారు. అందువల్ల రాయితీని 90శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 16: స్పందన అర్జీలపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగే స్పందనకు పలు సమ్యలు రాగా వాటి పరిష్కారం కోసం కమిషనరు ఎం.జశ్వంత్‌రావు మంగళవారం అధికారులతో కలిసి స్థానిక ఘోష్ రోడ్, గద్దలగుంటలో గల రోడ్డు సమస్యను పరిశీలించడంతోపాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.వెంకటేశ్వర్లు, డి.పద్మ, టీపీబీఎస్.ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

హైస్కూలు ప్లస్‌లను బలోపేతం చేయాలి : డీఈవో

ఒంగోలు(విద్య), జూలై 16 : జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ హైస్కూళ్ళలో నిర్వహిస్తున్న హైస్కూలు ప్లస్ జూనియర్ కళాశాలలను బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని డీఈవో సుభద్ర హెచ్ఎంలను ఆదేశించారు. హైస్కూలు ప్లస్ అడ్మిషన్లు, సాధించిన ఫలితాలను ఆమె మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో సమీక్షించారు. ప్రతి హైస్కూలు ప్లస్‌లో గరిష్ఠంగా 40మంది, కనీసం 20 మంది విద్యార్థులు ఉండాలన్నారు. జిల్లాలోని 20 హైస్కూలు ప్లస్‌లలో కేవలం నాలుగు స్కూళ్లలోనే 20మందికంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో ఆ నలుగురు హెచ్ఎంలను అభినందించారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ఎక్కువ మంది పిల్లలను చేర్పేందుకు హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మిగులుగా తేలినవారు, అర్హతలు ఉన్న వారిని హైస్కూలు ప్లస్‌లో డిప్యుటేషన్ వేస్తామని తెలిపారు.

అక్రమ తొలగింపులను నిలుపుదల చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16 : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపులను అడ్డుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి తప్పులు లేకున్నా, కారణాలు లేకుండానే ఉద్యోగం నుంచి తప్పుకోవాలని వత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఇప్పటికే సగానికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు చేశారని, మిగిలిన వారు కూడా తప్పుకోవాలని ఇబ్బందిపెడుతున్నారని, తమకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొప్పోలు రామకృష్ణ, కొత్తపల్లి పుల్లయ్య, ఐనంపూడి వీరబ్రహ్మాయ్య, జానుబాబు, అద్దంకి వెంకట్రావు, బొజ్జ మల్లికార్జున, బిరుదల కమలహాసన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ కమిటీ

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 16 : ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ నూతన కమిటీ మంగళవారం ఎన్నికైంది. ఏపీ మునిసిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే.రఫి, షేక్ మీర్జాబాబు ఆధ్వర్యంలో ఒంగోలులోని కార్యాయలంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా ఖాదర్‌వలి, ప్రధానకార్యదర్శిగా ఎస్‌కే.అక్బర్‌బాషాతోపాటు మరో పదిమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. మరో పన్నెండు మందిని సభ్యులుగా చేర్చుకుని సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించారు.

ఎస్పీ గరుడ్‌కు ఆత్మీయ వీడ్కోలు

ఒంగోలు(క్రైం), జూలై16: ఎన్నికల సమయంలో ఎస్పీగా పనిచేసి బదిలీపై వెళుతున్న గరుడ్ సుమిత్ సునీల్‌కు పోలీసుశాఖ తరుపున ఆత్మీయ వీడ్కోలు పలికారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిచగలిగామని చెప్పారు. అనంతరం పోలీసులు అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, అశోక్ బాబు, ఏవో సులోచన, డీఎస్పీలు కిషోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్, బాలసుందరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర మహాసభలు మంగళవారం ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో జరిగాయి. ఈ మహాసభలకు నగర అధ్యక్షుడు కె.గోపి, కె.సామ్రాజ్యం, కోటేశ్వరరావులు అధ్యక్షతన వహించారు. ఈ సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ విభాగాల్లో వేలాది మంది అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసరావు, టి.మహేష్, కె.శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, జి.రమేష్, ఎస్‌డీ.హుస్సేన్, బంక సుబ్బారావు, టి.విజయ, డి.సుబ్బారావు, ఎం.బాబు, రవి పాల్గొన్నారు.


ఉషోదయ
• సూపర్ మార్కెట్ •
ప్రతినిత్యం నాణ్యతకు అంకితం
31వ స్టోర్
గొప్ప ప్రారంభోత్సవం
ఒంగోలులో, జూలై 17 2024 న
ఉదయం 09:46 నిమిషాలకు
సుస్వాగతం
ప్రారంభోత్సవ ముఖ్య అతిథి
శ్రీ దామచర్ల జనార్ధనరావు
శాసన సభ్యులు, ఒంగోలు నియోజకవర్గం.
జ్యోతి ప్రజ్వలన
శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి
ఎంపీ, ఒంగోలు నియోజకవర్గం.
ముఖ్య అతిథి
శ్రీ ఉన్నం మురళీధర్ రావు
సీనియర్ న్యాయవాది
గౌరవ అతిథి
శ్రీ శిద్దా హనుమంత రావు
మేనేజింగ్ డైరెక్టర్, కె ఎస్ జి గ్రూప్
గొప్ప ప్రారంభోత్సవ ఆఫర్లు
MIN DISCOUNT 5.4%, UP TO 50% OFF ON MRP ALL BRANDS
(EXCEPT PERISHABLE ITEMS)
PURCHASE OF ₹ 999/-AND ABOVE GET SUGAR 1KG FREE WORTH ₹50/-
PURCHASE OF ₹ 1999/- AND ABOVE GET CHETAN BUCKET 16LTR FREE WORTH ₹ 210/-
KAJU, BADAM, PISTA, WALNUT, RAISINS, 200 G
₹ 899/- ONLY
DRY FRUITS COMBO PACK 1KG
FREEDOM OIL 5LTR+ SRIVARI ATTA 5KG, SUGAR 2KG COMBO PACK
SPL PRICE
₹ 899/- ONLY
₹ 240/- OFF ON MRP
SURF EXCEL MATIC FRONT LOAD / TOP LOAD 4KG+2KG FREE
₹ 240/- OFF ON MRP
ARIEL MATIC FRONT LOAD/ TOP LOAD 4KG+2KG FREE
₹ 155/- OFF ON MRP
ARIEL LIQUID 3 LTR POUCH FRONT LOAD/ TOP LOAD
₹ 210/- OFF ON MRP
MEGA SAVER PACK
SURF EXCEL MATIC FRONT LOAD LIQUID/TOP LOAD LIQUID 4LTR
₹ 16/- OFF ON MRP ₹ 88/-
SURF EXCEL BAR 4*200GMS
₹ 30/- OFF ON MRP ₹ 243/-
MYSORE SANDAL SOAP 3*150 GMS
₹ 85/- OFF ON MRP ₹ 174/-
PEARS PURE & GENTLE (125*3) 375 GMS
₹ 85/- OFF ON MRP ₹ 209/-
DOVE CREAM BAR 125GX3
₹ 50/- OFF ON MRP ₹ 147/-
PARACHUTE OIL 600ML
BUY1 GET1 FREE
DABUR RED GEL TOOTH PASTE 300G
BUY1 GET1 FREE
HEAD & SHOULDERS COLLECTION SHAMPOOS, CONDITIONER & 2 IN 1
BUY1 GET2 FREE
REAL MAN ATTRACT/MOOD/ SPIRIT/THRILL 200 ML
₹ 111/- ONLY
FREEDOM REFINED SUNFLOWER OIL 1 LTR
₹ 585/- ONLY
SPL PRICE
GOLD DROP SUNFLOWER OIL 5LTRS
₹ 585/- ONLY
SPL PRICE
FREEDOM REFINED SUNFLOWER OIL 5LTR
BUY1 GET1 FREE
TATA CHAKRA GOLD CARE 250GM
₹ 50/- OFF ON MRP ₹ 320/-
BROOKE BOND 3 ROSES NATURAL CARE 500G
₹ 50/- OFF ON MRP ₹ 305/-
BROOKE BOND TAJ MAHAL 500G
₹ 70/- OFF ON MRP ₹ 520/-
BRU INSTANT COFFEE 200G REFIL
₹ 30/- OFF ON MRP ₹ 310/-
BRU GREEN LABEL ROAST & GROUND 500 GMS
ఉషోదయ సూపర్ మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్
ఒంగోలు పబ్లిక్ స్కూల్ ఎదురుగా, మంగమూరు రోడ్, ఒంగోలు. ఫోన్: 9392176800



రాచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- పలు సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు

గిద్దలూరు, జూలై 16 : ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రస్తుతం ఎన్నికలు ముగిశాయని ఇక అభివృద్ధి పైనే దృష్టి పెడతామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. రాచర్ల మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. సర్పంచుల నుంచి, ఎంపిటిసిల నుంచి పంచాయతీల వారిగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ సమస్య అయినా తన దృష్టికి తెస్తే దశల వారిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందేందుకు ప్రతి ఒక్కరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా ఫించన్ రూ.4వేలకు పెంచినట్లు తెలిపారు. అన్ని ఎన్నికల హామీలను దశల వారిగా అమలు చేస్తామని పేర్కొన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రాచర్ల మండల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. ప్రజలైనా, నాయకులైనా ఎవరైనా నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ షేక్ ఖాశింబీ, జడ్పీటీసీ సభ్యురాలు పగడాల దేవి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో గిరిధరశర్మ, వ్యవసాయాధికారి రఫిక్, పలుశాఖల అధికారులు, టీడీపీ మండల అధ్యక్షులు యోగానంద్, టీడీపీ నాయకులు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంభం : గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన గిద్దలూరు నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి పథంలో పయనించేలా చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అర్ధవీడు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మారుమూల ప్రాంతమైన అర్ధవీడు మండలానికి ప్రత్యేక నిధులు తెచ్చి అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. అర్ధవీడు మండలం భౌగోళికంగా రెండు పాయలుగా ఉందని, అన్ని గ్రామాలలో రోడ్లపై భారీగా గోతులు ఏర్పడి ఉన్నాయని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తన దృష్టికి తెచ్చారు. రోడ్లకు యుద్ధప్రాతిపదిక పాచ్‌వర్కులు చేయించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, రెవె న్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖలపై చర్చించారు. కార్యక్రమంలో అర్ధవీడు ఎంపీపీ నేదూరి వెంకట్రావు జడ్పీటీసీ సభ్యులు చెన్ను విజయ, ఎంపీడీవో సాంబశివరావు, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎమ్మెల్యేకు సన్మానం

గిద్దలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన ముత్తుముల అశోక్‌రెడ్డిని, అర్ధవీడు మండల టీడీపీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

కోతుల బెడదను నివారించాలి

గిద్దలూరు, జూలై 16 : గిద్దలూరు పట్టణంలో కోతుల బెడదను నివారించాలని బీజేపీ జిల్లాశాఖ ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలువీధుల్లో కోతులు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయని, కోతుల దాడిలో చిన్నపిల్లలు, వృద్ధులు గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారని పేర్కొన్నారు. కోతులను పట్టి అడవిలో వదిలివేయాలన్నారు. చాలావీధుల్లో కుక్కలు సైతం గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న దృష్ట్యా వీధికుక్కలను సైతం పట్టి అడవిలో వదలాలని విజ్ఞప్తి చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారించాలి

- ఎమ్మెల్యేకు ఉపసర్పంచ్ వినతిపత్రం

కంభం, జూలై 16 : కంభం మండలం హజరత్‌గూడెం పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.30లక్షలకు పైగా జనరల్ ఫండ్ నిధులు దుర్వినియోగం చేశారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హజరత్‌గూడెం ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే నిధుల దుర్వినియోగంపై పంచాయతీలో ఐదేళ్ల పాలనలో జరిగిన నాసిరకం పనులపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని జిల్లా పంచాయతీ అధికారికి, కలెక్టర్‌ను ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జోష్యులును వివరణ కోరగా పంచాయతీలో ఎటువంటి నిధుల దుర్వినియోగం జరుగలేదన్నారు. నిబంధనలకు అనుగుణంగానే పనులు చేశామన్నారు. ఈనెల 24న జరిగే గ్రామసభలో అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు.

పశుపోషకులకు చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎఫ్ఆర్‌వో లక్ష్మీ ప్రసన్నజ్యోతి

పెద్ద దోర్నాల, జూలై 16: పెద్దపులి దాడిలో మృతిచెందిన పశువులకు సంబంధించి వాటి యజమానులకు నష్టపరిహారం చెక్కులను రేంజి అధికారి లక్ష్మీ ప్రసన్నజ్యోతి మంగళవారం పంపిణీ చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలోని ఎగువ చెర్లోపల్లి గ్రామానికి చెందిన పశువులు సమీప అడవికి మేతకు వెళ్లిన సమయంలో పులి దాడి చేసి హతమార్చింది. దీంతో పశువుల యజమానుల విజ్ఞప్తి మేరకు అటవీ శాఖ స్పందించి నష్టపరిహారం మంజూరు చేసింది. ఈ క్రమంలో స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో బాధితులు జంగాల హనుమంతుకు రూ.50,000లు, ఒంటేరు రాఘవ హనుమంతుకు రూ.60,000లు, వెన్నం పెద్ద జడలయ్యకు రూ.25,000లు, జంగాలరాజుకు రూ.20,000లు, జంగా పోలిరాజుకు రూ. 25,000లు,జంగాల వెంకటేశ్వర్లుకు రూ.25,000లు మొత్తం రూ.2,05,000లు అందజేశారు. కార్యక్రమంలో బీట్ అధికారులు లానిషా, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరటితోటలతో చెంచు గిరిజనులకు ప్రయోజనం


కూరగాయల విత్తనాలు అందుకుంటున్న గిరిజనులు

పెద్ద దోర్నాల, జూలై 16: చెంచు గిరిజనులకు పెరటితోటల పెంపకంతో బహుళ ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారి జవహర్ లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని నందిగూడెంలో సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాల విత్తనాల సంచులను వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇంటి ఆవరణలో పెరటి తోటలసాగు గిరిజన కుటుంబాలకు ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు లభించడమే గాక మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తాయన్నారు. ప్రకృతిసేద్యం ద్వారా పండించిన పంటలకు మార్కెట్టులో గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు సంస్థలు అందించే తోడ్పాటును సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వైశాలి కో-ఆర్డినేటర్ బాలరాజు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో కొండచిలువ కలకలం

పొదిలి, జూలై 16 : పట్టణంలోని సేయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి ఇళ్లమధ్యలో తిరుగుతూ కొండచిలువ భయాందోళనకు గురి చేసింది. చెట్లలో ఉండాల్సిన కొండచిలువ నివాసగృహాల మధ్యకు రావడంతో భయానికి గురైన స్థానికులు పెద్దగా అరుస్తూ ఇళ్ల బయటకు వచ్చినట్లు సమాచారం. ఆ తరువాత మురుగుకాలువలోకి వెళ్లడంతో స్థానికులు స్నేక్ కాచర్‌ను పిలిచి పట్టించారు. ఇది విషపూరితమైన పాముగా గుర్తించారని తెలిపారు. గోనె సంచిలో బంధించి గ్రామానికి దూరంగా వదిలారు.


స్నేక్ క్యాచర్ పట్టుకున్న కొండచిలువ

కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంను సమర్థవంతంగా నిర్వహించాలి

ఒంగోలు(విద్య), జూలై 16 : జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలల్లో కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంను సమర్థవంతంగా నిర్వహించాలని డీఈవో సుభద్ర కోరారు. స్థానిక సమగ్ర శిక్ష సమావేశపు మందిరంలో మంగళవారం కెరీర్ ఎడ్యుకేషనల్‌ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. పాఠశాలల్లో 8నుంచి 12 తరగతుల విద్యార్థులకు మైకెన్ షో యాప్ ద్వారా ఆన్‌లైన్ యాక్టివిటిస్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో ఎం.రమేష్, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వై.వెంకట్రావు, ఏడీ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన బార్ అసోసియేషన్

మార్కాపురం, జూలై 16: మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పుప్పాల శ్రీనివాసరావు, పిల్లి సుధాకర రావు, పూర్ణమహేష్‌లపై జరిగిన అమానుష దాడికి నిరసనగా స్థానిక న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూపని కాశయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభాల్లో ఒకటైన న్యాయ వ్యవస్థపై దాడి చేయడం అమానుషమన్నారు. ఈ దాడి న్యాయవాదులందరినీ ఆందోళనకు గురిచేసిందన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఇలాంటి ఘటనలను తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. దాడుల ద్వారా న్యాయవ్యవస్థను అదుపు చేయాలనుకోవడం మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వై.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉమ్మడి రవీంద్రనాథ్, మాజీ అధ్యక్షులు కె.శ్రీనివాస చౌదరి, సీనియర్ న్యాయవాదులు ఎస్‌కే యూసఫ్‌అలి, సయ్యద్ అలీ జహీర్, గాయం లక్ష్మీకుమార్‌రెడ్డి, ఇమ్మడిశెట్టి నాగేశ్వరరావు, తోట ఉష, ఎస్.ప్రసాద్, వల్లభనేని కాశయ్య, వై.వెంకటేశ్వరరెడ్డి, బత్తుల రామిరెడ్డి, కడియం రామయ్య, బి.రంగారెడ్డి, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం

తర్లుపాడు, జూలై 16: మత సామరస్యానికి ప్రతీకంగా మొహర్రం వేడుకలను పలు గ్రామాల్లో నిర్వహించారు. మండలంలోని తుమ్మలచెరువు, తర్లుపాడు, గొల్లపల్లె, కలుజువ్వలపాడులలో మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. తుమ్మలచెరువులో అర్ధరాత్రి జరుగు పెద్దషరిగెత్ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ర్టాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అగ్నిగుండానికి ఆహూతిగా టన్నుల కొద్ది కొబ్బరి చిప్పలు భక్తులు అగ్నిగుండంలో వేస్తారు. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువు మొహర్రం వేడుకలకు సుమారు 70 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని ముజావర్లు తెలిపారు. ఇక్కడికి ఎక్కువగా సంతానం లేనివారు, వ్యాధిగ్రస్థులు, మొక్కులు తీర్చుకునేందుకు వస్తారు. నెలవంక మొదలు 10 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. పెద్ద షరిగెత్ కార్యక్రమం సందర్భంగా పీర్లు దర్గా నుంచి లేచి అగ్నిగుండం చుట్టూ ప్రదర్శన చేసి గ్రామోత్సవం నిర్వహిస్తారు. పెద్ద షరిగెత్ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా పొదిలి సిఐ మల్లికార్జున్, తర్లు పాడు ఎస్ఐ వేముల సుధాకర్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


భక్తులు నడిచేందుకు సిద్ధం చేస్తున్న నిప్పులగుండం


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పీర్ల పెద షరగతు

పొదిలి : మొహర్రం పండుగ సందర్భంగా పట్టణంలో మంగళవారం రాత్రి పెదషరగతు నిర్వహించారు. తూర్పు పాలెం, పడమటిపాలెంలో భక్తులు పీర్లను పట్టు కొని నిప్పుల గుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. మహిళలు పీర్లను దర్శించుకొని తమ వారుపోసి మొక్కులు తీర్చుకున్నారు. ఇమాంహుస్సేన్, ఇమాంహసేన్ పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. పీర్లను నవాబుమిట్ట, తూర్పుపాలెం, పడమటిపాలెం, మసీదుతోట మీదుగా పీర్ల ఊరేగింపు సాగనుంది. బుధవారం సాయంత్రం పీర్లు సలాములు అందుకోనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి

పెద్ద దోర్నాల, జూలై 16: మండలంలోని కౌలు రైతులు పంట సాగుహక్కుపత్రం(సీసీఆర్‌సీ) పొందాలని ఏవో జవహర్ లాల్‌నాయక్ అన్నారు. మండలంలోని నల్లగుంట్ల, ఎగువ చెర్లోపల్లి గ్రామాల్లో కౌలు రైతులకు ఏవో జవహర్‌లాల్ నాయక్ పంటసాగు హక్కుపత్రాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా సీసీఆర్‌సీ కార్డులు మంజూరుతో కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు పంట నష్టపరిహారం, పంటల బీమా వంటివాటికి అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో, వీపీఏలు పాల్గొన్నారు.

హక్కుపత్రాల అందజేత

గిద్దలూరు : పంటసాగు చేసుకుంటున్న కౌలు రైతులకు పంటసాగు హక్కుపత్రాలను ఏవో విజయభాస్కర్‌రెడ్డి అందజేశారు. పంటసాగు హక్కుపత్రంపై మండలంలోని గడికోట, ఉయ్యాలవాడ, సంజీవరాయునిపేట, ఓబులాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న కౌలురైతులకు కౌలు కార్డులను, పంట సాగుహక్కు పత్రాలను అందజేశారు. దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని, దీని వలన ప్రభుత్వం ద్వారా పథకాలకు అర్హులు అవుతారని పేర్కొన్నారు. పంటనమోదు, పంటలబీమా, నష్టపరిహారం, రుణాలు, ఉత్పత్తుల అమ్మకాలు, విత్తనాల కొనుగోలు విషయంలో రాయితీ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామరెవెన్యూ, వ్యవసాయ, పట్టుపరిశ్రమ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్‌జియా


అవగాహన కల్పిస్తున్న ఏవో జవహర్‌లాల్‌నాయక్

కౌలుకార్డు ఎంతో మేలు

పొదిలి : రైతులు కౌలుకార్డు పొందితే ప్రభుత్వం నుంచి పలు రాయితీ విత్తనాలు, మందులు, ఎరువులు పొందే అవకాశం ఉంటుందని తహసీల్దార్ మహ్మద్‌జియా అన్నారు. మంగళవారం మండలంలోని కుంచేపల్లి, పాములపాడు గ్రామాల్లో రైతులకు పంట సాగు హక్కుదారు పత్రాల అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిరైతు కౌలుకు తీసుకున్న యజమాని దగ్గర కౌలుహక్కు పత్రం పొందేందుకు అగ్రిమెంట్ చేయించుకోవాలన్నారు. కనుక వీఆర్వో, వీపీఏలు ప్రజలకు తెలియజేసి కౌర్డు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్డు కాల పరిమితి ఏపీ కౌలుదారుల చట్టం ప్రకారం 11 నెలల కాలం చెల్లుబాటులో ఉంటుందన్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి వారితో అగ్రిమెంట్ నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. కౌలుదారుడు కార్డు దరఖాస్తు చేసుకున్న మూడురోజుల్లో కార్డు అందజేస్తామన్నారు. భూయజమాని ఆ గ్రామంలో లేకపోతే వీడియో, ఈమెయిల్ ద్వారా తమ నిర్ణయాన్ని తెలియజేయవచ్చన్నారు. ప్రతి కౌలురైతు తప్పనిసరిగా కౌలుకార్డు తీసుకోవాలని కోరారు. రైతు సాగు చేసిన పంటను నమోదు చేసుకొని ప్రభుత్వం నుండి వచ్చే పంట నష్టపరిహారం ఏదైన పొంద వచ్చన్నారు. అదే విధంగా బ్యాంకు రుణాలు కూడా పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్ జైన్ లుబ్దీన్, వీఆర్వో వీపీఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీఎంవో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా యశ్వంత్‌రెడ్డి

మార్కాపురం వాసికి గుర్తింపు

మార్కాపురం, జూలై 16: రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారిగా మార్కాపురం పట్టణానికి చెందిన డాక్టర్ తంగిరాల యశ్వంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం జమ్మలమడుగు డీఎస్పీగా పనిచేస్తున్నారు. అత్యంత క్లిష్టమైన కడప జిల్లాలోని జమ్మలమడుగు ప్రాంతంలో మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైన ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారిగా డీఎస్పీ డాక్టర్ యశ్వంత్‌ను నియ మించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు డాక్టర్ యశ్వంత్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడి పట్టాల్సిన వైద్యుడు లాఠీ పట్టాడు..

మార్కాపురం పట్టణానికి చెందిన డాక్టర్ యశ్వంత్ తల్లిదండ్రులు తంగిరాల నాగజగన్నాధ్, శార్వాణిలు ఇద్దరు ఉపాధ్యాయులే. నాగజగన్నాధ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత. ఈయన ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేశారు. శార్వాణి ప్రస్తుతం కంభం మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారి ఇద్దరి సంతానంలో రెండో వాడైన యశ్వంత్ గుంటూరులోని ఎన్ఆర్ఐలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. కానీ మొదటి నుంచి ఆయనకు ఐపీఎస్ కావాలనేది కల. ఆ దిశగా రెండుసార్లు సివిల్స్‌లో ప్రయత్నించి కొద్ది మార్కుల్లో విఫలమయ్యాడు. ఈ క్రమంలో గ్రూప్-1కు 2015లో తొలి ప్రయత్నంలోనే ఎంపికై డీఎస్పీగా పోస్టింగ్ సాధించాడు. శిక్షణ అనంతరం 2016లో పుత్తూరు డీఎస్పీగా నియమితులయ్యారు.

సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు

మొదటి పోస్టింగ్ చిత్తూరు జిల్లా పుత్తూరులో డీఎస్పీగా ఉత్తమ సేవలందించడంతో తర్వాత చంద్రగిరి, తిరుపతిలాంటి అత్యంత ప్రాధాన్యం వున్న ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ప్రధానంగా ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో దిట్టగా గుర్తింపు పొందాడు. తిరుపతి నుంచి పుట్టపర్తికి అక్కడ నుంచి జమ్మలమడుగుకు బదిలీ అయ్యారు. చివరిగా పని చేసిన జమ్మలమడుగులో ఫ్యాక్షన్ రాజకీయాలు ఎక్కువ. పైస్థాయి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ. ఎంతో సమర్థత ఉంటేనే అక్కడ ఎన్నికలను సజావుగా నడపగలిగేది. కానీ డీఎస్పీగా డాక్టర్ యశ్వంత్ 2024 మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జమ్మలమడుగు ప్రాంతంలోని నియోజకవర్గాల్లో ఎలాంటి పెద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పనిచేశారు. దీంతోనే రాష్ట్రస్థాయి పోలీసు అధికారుల దృష్టిలో యశ్వంత్ పడ్డాడు. విధులు సమర్థవంతంగా నిర్వర్తించడం వలనే నేడు ఎంతో కీలకమైన రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులయ్యారు.


యశ్వంత్‌రెడ్డి

అవీ..ఇవీ..

రెండవరోజు కొనసాగిన నిరాహారదీక్ష


దీక్షలు చేపట్టి నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

పొదిలి, జూలై 16 : పొదిలి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు చేపట్టిన రిలే నిరిహారదీక్ష యూనియన్ డిపో కార్యదర్శి పి.ఓబులేసు అధ్యక్షతన రెండవరోజు కొనసాగింది. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులను ఆశ్రయించినా ఫలితం లేదన్నారు. దీంతో రీజనల్ కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కారించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. డ్యూటీ చార్టులు, ప్రతినెల రెండు రోజులు సెలవులు, ఉద్యోగులకు ఇవాల్సిన ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా మహిళా కార్మికుల పట్ల అధికారులు వివక్షతో వ్యవహరిస్తున్నారన్నారు. వివక్ష విడనాడి అందరిని సమానంగా చూడాలని డిమాండ్ చేశారు. రద్దుచేసి ఎక్స్‌ప్రెస్‌లను వెంటనే అన్ని రూట్‌లకు పునరుద్ధరించాలని కోరారు. సమస్యలపై ఉన్నతాధికారులు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు లేదు ... కాలువ లేదు


రోడ్డు, కాలువ లేకపోవడంతో రోడ్డు మధ్యలో నిలిచిన మురుగు

గిద్దలూరు, జూలై 16 : పట్టణంలోని పాములపల్లె రోడ్డులోని పాత సత్యనారాయణ థియేటర్ పక్కన ఉన్న వీధిలో రోడ్డు నిర్మించలేదు, డ్రైనేజీ కాలువలు అసలే లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మట్టి రోడ్డంతా బురదమయంగా మారుతోంది. చాలారోజుల వరకు రోడ్డు మధ్యలో బురద అలాగే ఉండి నీరు పాచిపట్టి నడిచేందుకు వీలుకాని దుస్థితి నెలకొంది. దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఈ వీధిలో ఒక ఎయిడెడ్ పాఠశాల ఉండగా చిన్నారులు బురదనీటి నుంచే నడిచి పాఠశాలకు వెళుతున్నారు. ఒక్కొక్కసారి జారి కిందపడి గాయాల పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వీధిలో నీరు నిల్వ లేకుండా కనీసం కాలువ అయినా ఏర్పాటు చేయాలని, శాశ్వతంగా సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్ కుప్పంకు బదిలీ

గిద్దలూరు టౌన్, జూలై 16 : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న యూ.శ్రీనివాసరావు బదిలీపై కుప్పం మున్సిపాలిటీకి వెళ్లారు. ఎన్నికల సమయంలో బదిలీపై గిద్దలూరు వచ్చారు. ప్రస్తుతం గిద్దలూరు కమిషనర్‌గా ఉన్నతాధికారులు ఎవరినీ నియమించక పోవడంతో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్‌గా ఏఈ బి.శంకర్‌నాయక్‌ను నియమించారు.

పట్టణంలోని సమస్యలను గుర్తించండి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్ టౌన్, జూలై 16: మార్కాపురం పట్టణంలో కోతులు, కుక్కలు, దోమల బెడదతో పాటు ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు సమస్యలు పరిష్కరించాలని కమిష నర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో అనేక వీధులలో కోతులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. అదేవిధంగా వర్షాలు పడడంతో మురుగనీరు చేరి దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం ఎక్కువగా ఉందన్నారు. మున్సిపల్ స్థలాల్లో అక్రమ కట్టడాలతో రోడ్లు కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడిందన్నారు. గోవులు రోడ్లపై సంచరిస్తుండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు గోవులను గోశాలకు తరలించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని సమస్యలన్నీ తీరే విధంగా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీజేపీ సీనియర్ నాయకులు బొంతల కృష్ణ, మద్దెల లక్ష్మీదేవి, పట్టణ ఉపాధ్యాక్షులు ఏవీ సుబ్బారావు, ముస్లింమైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షులు బాషా, మీడియా కన్వీనర్ రామకృష్ణ, బీహార్ కిషన్ తదితరులు వినతిప్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

స్తంభాన్ని తాకితే షాక్ కొడుతోంది

- ఇనుప స్తంభం స్థానంలో సిమెంట్ స్తంభం ఏర్పాటుకు వినతి
- ప్లాస్టిక్ తొడుగు ఏర్పాటు చేసిన స్థానికులు

గిద్దలూరు, జూలై 16 : వర్షం పడితే ఆ విద్యుత్ స్తంభంలో విద్యుత్ ప్రసరిస్తోంది. ఆ సమయంలో ఎవరైనా పొరపాటున ఆ స్తంభాన్ని తాకితే షాక్ కొట్టడం ఖాయం. ఈ విషయాన్ని స్థానికులు పలుమార్లు స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో స్థానికులే ఆ ఇనుప స్తంభానికి ప్లాస్టిక్ తొడుగును ఏర్పాటు చేశారు. పట్టణంలోని శర్మవీధిలోని జువ్విళ్ల వినాయకస్వామి దేవస్థానం పక్కనే విద్యుత్ స్తంభం ఉంది. ఈ స్తంభం మూడు రోడ్లకు కూడలిలో ఉంది. దేవాలయానికి వచ్చిపోయే వారు, ఆడుకునేపిల్లలు ఈ స్తంభం దగ్గరే తిరుగుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా ఎర్త్ అయి స్తంభాన్ని తాకితే షాక్ కొడుతోంది. పలు పర్యాయాలు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, స్తంభం మారుస్తామని చెప్పడం మినహా చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజలు ప్లాస్టిక్ పైపును తెచ్చి ఈ స్తంభానికి చుట్టి తాత్కాలికంగా రక్షణ పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ ఇనుప స్తంభం స్థానంలో సిమెంటు స్తంభాన్ని ఏర్పాటు చేసి షాక్ తగలకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


విద్యుత్ ఇనుప స్తంభానికి ఏర్పాటు చేసిన ఇనుప తొడుగు

ఆర్మీ ఉద్యోగి ఇంట్లో చోరీ

గిద్దలూరు టౌన్, జూలై 16 : పట్టణంలోని కొంగళవీడు రోడ్డులో నివాసం ఉంటున్న సైనిక ఉద్యోగి ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జి.సురేష్ అనే ఆర్మీ ఉద్యోగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. కుటుంబసభ్యులంతా ఓ వేడుక నిమిత్తం బంధువుల ఇంటికి సోమవారం ఉదయం వెళ్లారు. మంగళవారం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడం కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై రంగయ్య ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కుటుంబసభ్యులు చెప్పిన ప్రకారం 3 జతల వెండి పట్టీలు, 5 చిన్నపిల్లల బంగారు ఉంగరాలు, రెండు జతల కమ్మలు చోరీకి గురైనట్లు, వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రజకులకు అన్నివిధాలా సహకారం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ఎమ్మెల్యే ఉగ్రను మర్యాదపూర్వకంగా కలసిన రజకసంఘం నాయకులు

కనిగిరి, జూలై 16: రజకుల సంక్షేమం కోసం అన్నివిధాలుగా తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం రజక సంఘం రాష్ట్ర నాయకుడు బాలవెంకటరమణ డాక్టర్ ఉగ్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బాలవెంకటరమణ తమకు ఏపీ రజక కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రజకులకు ప్రభుత్వం నుంచి అందించే పథకాల లబ్ధిలో కనిగిరి ప్రాంత రజకులకు అత్యధికంగా మేలు జరిగేవిధంగా కృషి చేయాలని రజకసంఘం రాష్ట్ర నాయకులకు సూచించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు డి.శివకాశయ్య, చిలకపాటి లక్ష్మయ్య, కోమటికుంట్ల వీరయ్య, ఆరెకొండ హరిప్రసాద్, చెలికచర్ల శ్రీను(పండు), మాచర్ల సుబ్బయ్య, కొండయ్య, ఉదయగిరి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

వెలిగండ్ల, జూలై 16: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌లు ధరించి ప్రమాదాలను నివారించాలని ఎస్సై శివ కోరారు. వెలిగండ్లలో కనిగిరి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో అధిక మరణాలు హెల్మెట్ వాడక పోవడం వల్లే సంభవిస్తున్నాయన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుడ్‌హెల్ప్ రమేష్, అచ్చిరెడ్డి, శ్రీనివాసులు, శామ్యేల్, తదితరులు పాల్గొన్నారు.

సకల పుణ్యరాశి తొలిఏకాదశి

» నేటి నుంచి విష్ణుమూర్తి యోగనిద్ర

ఒంగోలు(కల్చరల్), జూలై 16: సకల పుణ్యరాశి తొలిఏకాదశి అని పురాణాలు పేర్కొంటున్నాయి. సహజంగా మనం ఏ పని ప్రారంభించాలన్నా పాడ్యమి మొదలు చతుర్దశి వరకు ఉన్న తిథుల్లో దశమి, ఏకాదశిలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. అటువంటి ఏకాదశిలు నెలకు రెండు చొప్పున ఏడాది 24 వస్తుంటాయి. ఆషాఢమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని పూర్వం సంవత్సర ఆరంభంగా పరిగణించేవారు. అందుకే ఏడాదిలో మొదటిగా వచ్చే దానిని 'తొలి ఏకాదశి'గా పేరువచ్చింది. ఈరోజుకు అనేక విశిష్టతలు ఉన్నాయి. దక్షిణాయణం ప్రారంభమవుతుంది. చాతుర్మాస్య దీక్షను చేపడతారు. అనేక పండుగల ప్రారంభం కూడా తొలిఏకాదశి నుంచే జరుగుతుంది.

తొలి ఏకాదశిని 'శయన ఏకాదశి'గా పిలుస్తారు. ఈరోజునే శ్రీ మహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రకు ఉపక్రమిస్తారు. తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజు అంటే నాలుగు నెలల తర్వాత యోగనిద్ర నుంచి మేల్కొంటాడు. అందుకే దాన్ని ఉత్థాన ఏకాదశిగా పిలుస్తారు.

తొలిఏకాదశి రోజు నుంచే గ్రహ గమనాల్లో మార్పులు ప్రారంభమవుతాయి. ఉత్తరదిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లు కనిపిస్తాడు. పగలు తక్కువగా ఉండి రాత్రి సమయం పెరుగుతుంది. ఇక వానాకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కూడా ఇదే. ఈ ఆషాఢమాసంలోనే ప్రకృతిలో అనేక మార్పులు జరుగుతాయి.

తొలి ఏకాదశిని 'పేలాల పండుగ' 'పేలపిండి పండుగ' అని పిలుస్తారు. గ్రామాల్లో పేలాల పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. ఒకప్పుడు వైష్ణవాలయాల్లో పేలపిండిని ప్రసాదంగా పంచేవారు. ఆరోగ్యపరంగా కూడా పేలపిండి ఎంతో మంచిది. వానాకాలం వల్ల వచ్చే జబ్బులను నివారించి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించటానికి బెల్లం కలిసిన పేలపిండి ఎంతగానో ఉపయోగపడుతుంది.

చాతుర్మాస దీక్ష

శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే ఈ తొలి ఏకాదశి రోజునుంచే పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలు నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్షను ప్రారంభిస్తారు. ఈకాలంలో వారు తామున్న చోటు నుంచి ఎక్కడికీ కదలరు. ఈ నాలుగు నెలలపాటు ముత్తయిదువలు గోపద్మ వ్రతం చేస్తారు.

జిల్లావ్యాప్తంగా పలు వైష్ణవాలయాలలో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారయణలు మొదలైనవి నిర్వహించటానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తొలిఏకాదశి పండుగ సందర్భంగా పూలు, పండ్లు మొదలైనవి కొనుగోలు చేసేవారితో మంగళవారం సాయంత్రం పలు వ్యాపారకూడళ్లు సందడిగా మారాయి.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16: జిల్లాలో వివిధ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం పలుశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో భూసమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలన్నారు. పరిష్కారం చేయలేనివి నిర్దిష్టమైన కారణాలతో అర్జీదారునికి సమాచారం అందించాలని చెప్పారు. సంబంధిత ఆర్డీవోలు కూడా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ ఎక్కడ పూర్తి కాలేదో అక్కడ డ్రైవ్ మోడ్‌లో మ్యూటేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు. కోర్టు కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులపై డివిజన్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకొని కోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా ఆర్డీవోలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్‌ఇర్విన్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలను కల్పించాలి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకల్పనకు, వ్యవసాయ రంగ అభివృద్ధికి నాబార్డు తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పటిష్టంగా, లాభసాటిగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, నాబార్డు డీడీఎం రవికుమార్, పీడీసీసీబీ సీఈవో కోటిరెడ్డి పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణానికి 90శాతం రాయితీ ఇవ్వాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16 : గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 90శాతం రాయితీతో పాటు యూనిట్ వ్యయం రూ.3 లక్షలకు పెంచాలని ఏపీ గొర్రెలు, మేకలపెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి 90శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్లకు 70శాతం ఇవ్వాలని నిర్ణయించి పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందులో పశువులకు ఎక్కువ రాయితీ, సన్నజీవాలకు తక్కువ రాయితీ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్నిరకాల షెడ్లకు అంతే ఖర్చు అవుతుందని తెలిపారు. అందువల్ల రాయితీని 90శాతానికి పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

హైస్కూలు ప్లస్‌లను బలోపేతం చేయాలి

ఒంగోలు(విద్య), జూలై 16: జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ హైస్కూళ్లలో నిర్వహిస్తున్న హైస్కూలు ప్లస్ జూనియర్ కళాశాలలను బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని డీఈవో సుభద్ర హెచ్‌ఎంలను ఆదేశించారు. హైస్కూలు ప్లస్ అడ్మిషన్లు, సాధించిన ఫలితాలను ఆమె మంగళవారం ఒంగోలులోని తన కార్యాలయంలో సమీక్షించారు. ప్రతి హైస్కూలు ప్లస్‌లో గరిష్ఠంగా 40మంది, కనీసం 20 మంది విద్యార్థులు ఉండాలన్నారు. జిల్లాలోని 20 హైస్కూలు ప్లస్‌లలో కేవలం నాలుగు స్కూళ్లలోనే 20మందికంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో ఆ నలుగురు హెచ్‌ఎంలను అభినందించారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ఎక్కువ మంది పిల్లలను చేర్పేందుకు హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మిగులుగా తేలినవారు, అర్హతలు ఉన్న వారిని హైస్కూలు ప్లస్‌లో డిప్యుటేషన్ వేస్తామని సుభద్ర తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని బాలికల వసతి గృహం

» ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంచిన వైసీపీ ప్రభుత్వం
» బాలికలకు తప్పని అవస్థలు
» దొనకొండలో విద్యకు దూరమవుతున్న వైనం
» కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలంటూ ప్రజల విజ్ఞప్తి



నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహం

దొనకొండ, జూలై 16: దొనకొండ మండలంలోని పలుగ్రామాలకు చెందిన బాలికలకు ఉన్నత విద్య నిమిత్తం స్థానికంగా హాస్టల్ సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేక, స్థానికంగా ప్రవేశాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో పేద కుటుంబాలకు చెందిన పలువురు జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారు. ఈక్రమంలో తమ పిల్లల్ని హాస్టల్‌లో చేర్పేందుకు దొనకొండలోని కేజీబీవీ పాఠశాల, బీసీ బాలికల హాస్టల్‌లో అవకాశం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. దొనకొండలోని కేజీబీవీలో అడ్మిషన్లు రాక, బీసీ బాలికల హాస్టల్‌లో ప్రవేశం దొరక్క ఏం చేయాలో పాలుపోక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలకు పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్యాభివృద్ధి అందించాలనే ధ్యేయంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 150 మంది బాలికలు ఉండేందుకు దొనకొండకు బాలికల వసతి గృహం మంజూరు చేసింది. జడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేస్తే, అందులోఉంటూ జడ్పీ పాఠశాలలో చదువుకునేందుకు బాలికలకు రక్షణగా ఉంటుందని భావించారు. ఈక్రమంలో అధికారులు జడ్పీ పాఠశాల ఆవరణలో భవన నిర్మాణం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఈడబ్ల్యూఐడీసీ) నేతృత్వంలో దాదాపు రూ.కోటిన్నర వ్యయంతో మంజూరు కాగా, అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పనులు ప్రారంభించి ఎట్టకేలకు 2021 ఆగస్టులో పూర్తిచేశారు.

అయితే, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో బాలికల వసతి గృహం మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా వినియోగంలోకి వస్తుందన్న తల్లిదండ్రుల ఆశలు అడిఆశలుగానే మిగిలిపోయాయి.

జిల్లా కలెక్టర్ సందర్శించినా స్పందన కరువు

గత ఏడాది మార్చి నెలలో మండల పర్యటనకు విచ్చేసిన అప్పటి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ దొనకొండ జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా నిరుపయోగంగా ఉన్న బాలికల హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ భవనాన్ని పరిశీలించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. నేటికీ ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు.

నేడు శాంతి కల్యాణం

పామూరు, జూలై 16: పామూరు పట్టణంలోని అంకాలమ్మవీధి వడ్డెపాలెంలోగల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన తిరునాళ్లలో భాగంగా బుధవారం స్వామివార్ల శాంతి కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం దేవస్థానంలో గణపతిపూజ, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, లక్ష్మీహోమం, సాయంత్రం హనమత్ హోమం, మూర్తి హోమం, వాస్తుహోమం, మహానైవేద్య మంత్రపుష్ప నీరాజనం, పూజలు నిర్వహించారు.

అలాగే, మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం పెద్ద పీర్ల సరగత్ గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు. ఈసందర్భంగా అగ్ని గుండాలను కాల్చి తెల్లవారుజామున భక్తులచే పీర్లు అగ్నిగుండం చేయించనున్నట్లు తెలిపారు. అగ్నిగుండం చేయించిన పీర్లను గ్రామోత్సవం నిర్వహిస్తారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు స్మారక సభలు నిర్వహించాలి

తాళ్లూరు, జూలై 16: కారంచేడు నరమేధానికి నిరసనగా బుధవారం గ్రామాల్లో స్మారకసభలు జరపాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాళ్లూరులో జరిగిన మాలమహానాడు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కారంచేడు ఉద్యమ ఫలితంగా దేశవ్యాప్తంగా దళిత యువతలో చైతన్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అనపర్తి ఆదాము, ఏ.ప్రకాశం, సుబ్బారావు, బి.ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ విమానాశ్రయాన్ని పరిశీలించిన ఆర్డీవో



విమానాశ్రయ భూముల వివరాలు మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్

దొనకొండ, జూలై 16: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి పి.జాన్ ఇర్విన్ మంగళవారం దొనకొండలోని విమానా శ్రయాన్ని పరిశీలించారు. ఇందుకుసంబంధించిన భూములను నిశితంగా పరిశీలించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామూర్తినాయుడు భోగాపురం విమానాశ్రయం పరిశీలనలో రాష్ట్రంలో ఉన్న విమానాశ్రయాల వివరాల గురించి సంబంధిత అధికారుల నుంచి తెలుసుకున్నారు. దొనకొండల విమానాశ్రయ విషయాన్ని సీఎం, మంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు.

ఈనేపథ్యంలో దొనకొండలోని విమానాశ్రయంపై పూర్తి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్డీవో జాన్‌ఇర్విన్ దొనకొండలోని విమానాశ్రయ భవనం, 136.36 ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ ఫెన్సింగ్‌తో ఉన్న భూమిని పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వంలో దొనకొండలోని విమానాశ్రయం వినియోగం నిమిత్తం ఎయిర్‌పోర్టు అథారిటీ వారు అదనంగా నరసింహనాయునిపాలెం, ఇండ్లచెరువు గ్రామాల పరిధిలో సర్వే చేసిన 240 ఎకరాలకు సంబంధించిన భూముల వివరాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఆ భూముల్లో జీజీపీ భూమి, బండిదారి, వాగు, చెరువు ఎంత విస్తీర్ణంలో ఉంది, అందులో ఏమైనా ఆక్రమణలు ఉన్నాయా, ఇంకా అదనంగా ఎటువైపు ఎన్ని ఎకరాల వరకు పొడిగించే అవకాశం ఉంది, పొలాల మధ్యలో ఉన్న తారురోడ్డు ఏఏ గ్రామాలకు వెళ్తుంది, ఆ గ్రామాలకు వెళ్లేందుకు మరో మార్గం ఉందా తదితర పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. దొనకొండ విమానాశ్రయ పూర్తి సమాచారంను క్లుప్తంగా నివేదిక సిద్ధంచేసి కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో వివరించారు.

ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో ఐలూరి పిచ్చిరెడ్డి, మండల సర్వేయర్ మస్తాన్‌వలి, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

» బస్టాండ్ వద్ద పొంచిఉన్న ప్రమాదం



ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాలువకు పడిఉన్న గొయ్యి

పామూరు, జూన్ 16: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే ప్రయాణికులు ఆదమరిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఏమరపాటుతో ఆదమరిస్తే గొయ్యి రూపంలో ప్రమాదం పొంచి ఉంది. పామూరు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే దారిలో సైడు కాలువకు పెద్ద గొయ్యి ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకొన్న పాపానపోలేదు. ప్రయాణికులు బస్టాండ్‌లోకి వచ్చేటప్పుడు గాని, బస్సు దిగి బయటకు వచ్చేటప్పుడు గాని ఆదమరిస్తే ప్రమాదాలకు గురవుతారు. అప్రోచ్ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో బస్సులు వచ్చేటప్పుడు గతుకులతో అదుపు తప్పుతున్నాయి. పలు ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. వారం రోజుల క్రితం కారు అదుపు తప్పి సమీపంలోగల బంకుల్లోకి దూసుకెళ్లింది. గ్రామ పంచాయతి, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల

ఒంగోలు(విద్య), జూలై 16: ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన జీపీఎస్ గెజిట్‌ను నిలుపుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడం పట్ల ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు. జీపీఎస్ జీవోను రద్దు చేయాలని, ఓపీఎస్ అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలుకు చర్యలు తీసుకోకుంటే వాయిదా వేసుకున్న నిరసన కార్యక్రమాలు తిరిగి నిర్వహిస్తామని నాయకులు కేవీజీ.కీర్తి, బి.వెంకట్రావు, ఎ.అమ్మయ్య, బి.అశోక్‌కుమార్, పీవీ.సుబ్బారావు పేర్కొన్నారు.

దర్శి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

» కలెక్టర్‌కు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బొకే అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, జూలై 16: దర్శి నియోజకవర్గంలో ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఒంగోలులో కలెక్టర్‌ను కలిసి బొకే అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎన్నికల సందర్భంగా వైసీపీ నాయకులు చేసిన దాడులు, పోలీసులు వ్యవహరించిన తీరును వివరించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల్లో పనులు చేయకుండానే కోట్లాది రూపాయలు ప్రజాధనం లూటీ చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేయించాలని కోరారు. దర్శి పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దర్శి పట్టణంలోని 17వ వార్డులో ముస్లిం సోదరులు నిర్వహించిన మొహర్రం వేడుకల్లో వారు పాల్గొన్నారు.

బండిదారి ఆక్రమణల పరిశీలన



బండిదారి భూమిలో ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుజాత, మండల సర్వేయర్ రాజు తదితరులు

దర్శి, జూలై 16: దర్శి పట్టణం కురిచేడు రోడ్డులోని బండిదారి ఆక్రమణలను తహసీల్దార్ సుజాత, మండల సర్వేయర్ రాజు పరిశీలించారు. కోట్లాది రూపాయల విలువైన స్థలంలో వరుసగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై కొద్దిరోజుల క్రితం 'బండి దారి స్థలం ఆక్రమణ చరవీడేనా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు సుమారు పది ఎకరాల్లో జరిగిన ఆక్రమణలను పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్థలాన్ని పూర్తిగా కొలిపించి హద్దులు నిర్ధారించి కంచె ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైన ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కాగా, 757/2ఎ-1 సర్వేనెంబర్‌లో అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారని జిల్లా కలెక్టర్‌కు కొంతమంది గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లేఅవుట్‌ను పరిశీలించారు. దర్శి మండలంలో అక్రమ లేఅవుట్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్ దంపతులు

ముండ్లమూరు, జూలై 16: మండలంలోని పెదఉల్లగల్లులో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి 17వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామి వారి కల్యాణంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా వెంకటేశ్వర స్వామితో పాటు ఆలయంలో ఉన్న లక్ష్మీదేవిని, ధ్వజ స్తంభాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. ఉల్లగల్లుతో పాటు కెల్లంపల్లి, పసుపుగల్లు, ముండ్లమూరు, వేముల, కమ్మవారిపాలెం, చింతలపూడి, రాజగోపాలరెడ్డినగర్, లక్ష్మీనగర్, పులిపాడు, దర్శి, అద్దంకి, వినుకొండ, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలితసాగర్ దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కౌలు రైతులు పంటహక్కు పత్రం తీసుకోవాలి

కనిగిరి, జూలై 16: పొలాలు కౌలుకు తీసుకుని సాగుచేసే రైతులు తప్పనిసరిగా పంటహక్కు పత్రం తీసుకోవాలని ఏవో పి.జ్యోష్నాదేవి అన్నారు. మండలంలోని పోలవరం, బల్లిపల్లి గ్రామాల్లో మంగళవారం కౌలు రైతులకు పంటహక్కు పత్రంతో కలిగే లాభాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పంటహక్కు పత్రం ఉన్నట్లయితే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే కౌలు రైతులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారాన్ని పొందవచ్చునని చెప్పారు. అలాగే, ప్రధానమంత్రి ఫసల్ యోజన పథకం ద్వారా పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి కౌలురైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు బి.వెంకటసుబ్బయ్య, షేక్ షబానా, వీఆర్వోలు. రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏవో జ్యోష్నాదేవి





బదిలీలు



ఉన్నట్టా.. లేనట్టా..

- అయోమయంలో ప్రభుత్వ యంత్రాంగం
- కుంటుపడుతున్న పాలన
- పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు
- మాకెందుకులే అన్న రీతిలో అధికారుల తీరు
- కోరుకున్న చోటకు బదిలీ కోసం అధికారుల యత్నం
- భారీగా లేఖలు జారీ చేసిన ప్రజా ప్రతినిధులు

అధికారులందరినీ బదిలీ చేస్తారనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో ఉంది. ఇదే అభిప్రాయాన్ని కొత్త ప్రభుత్వం వ్యక్తం చేస్తూ వస్తోంది. దీంతో పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదు. ఉంటామో వెళతామో అనే అంశంపై స్పష్టత రాకపోవడంతో, చాలా ఫైళ్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పెండింగ్ సమస్యల విషయంలో పాత ప్రభుత్వంలో ఎదురైన అనుభవమే అక్కడక్కడా ప్రజలకు ఎదురవుతోంది. దీంతో జిల్లా అధికారుల బదిలీలపై ప్రభుత్వం త్వరిత గతిన నిర్ణయం తీసుకుంటే పాలన పూర్తి స్థాయిలో గాడిన పడే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీలపైనే చర్చ సాగుతోంది. బదిలీలు ఉంటాయా.. ఉండవా అన్న సందేహాలు ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొంది. కూటమి ప్రభుత్వం బదిలీలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పాలన కుంటు పడుతోంది. ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కార్యాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉంటామో బదిలీపై వెళతామో మాకెందుకులే అన్న రీతిలో ప్రజల సమస్యల పట్ల అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడే పరిస్థితి ఉంది. చేపట్టిన ప్రగతి పనులను అధికారులు ముందుకు తీసుకు పోవడంలేదు. కోరుకున్న చోటకు బదిలీ కోసం అధికార యంత్రాంగం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. ఇప్పటికే బదిలీల కోసం ప్రజా ప్రతినిధులకు అధికారులు లేఖలు అంద చేశారు. సచివాలయంలో మంగళవా రం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కూడా బదిలీలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో బదిలీల ప్రక్రియ తీవ్ర జాప్యం జరుగుతుందన్న వాదన అధికార యంత్రాంగం నుంచి వినిపిస్తోంది.

పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీవో.. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ.. వీఆర్వో నుంచి ఆర్డీవో వరకు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లా స్థాయి అధికారుల్లో కూడా నెలకొంది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో బదిలీలు ఉంటాయన్న సమాచారంతో అధికారులు వారి విధులు పూర్తి స్థాయిలో నిర్వహించకుండా మిన్నకుంటున్నారన్న విమర్శలున్నాయి. కోరుకున్న చోటకు బదిలీ అయ్యేలా ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఇందుకోసం ప్రజా ప్రతినిధుల ఇళ్లకు క్యూ కడుతున్నారు. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వారి లేఖలు పొందేందుకు అధికారులు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కొందరు ఎమ్మెల్యేలు బదిలీల సిఫార్సు లేఖలు జారీ చేశారు. వైసీపీతో అంట కాగిన అధికారులు విధుల్లో ఉండటంతో ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేస్తున్న పనులు జరగకపోతుండటంతో వారు కూడా తీవ్ర అసంతృప్తి చేస్తున్నారు. మునిసిపాలిటీలలో పరిస్థితి దారుణంగా ఉంది. మురుగు నీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. రెవెన్యూ శాఖలో రైతుల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఎన్నికల ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తహసీల్దార్‌లను పూర్తిగా బదిలీ చేశారు. తిరిగి అదే స్థాయిలో తహసీల్దార్‌ల బదిలీలు జరిగే అవకాశం ఉంది. దీంతో రెవెన్యూ శాఖలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సదరు అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక ఇంజనీర్లు అయితే ప్రగతి పనుల విషయంలో మిన్నకుంటున్నారు. ఇదే పరిస్థితి అన్ని శాఖల్లో నెలకొంది. పోలీసు శాఖలో కూడా బదిలీలు భారీగానే ఉంటాయన్న ప్రచారం నేపథ్యంలో సదరు అధికారులు శాంతి భద్రతల విషయంలో పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీతో అంటకాగిన వారు పోలీసు శాఖలో ఎక్కువగానే ఉన్నారు. వీరందరిని బదిలీ చేయాలని కూటమి శ్రేణులు ఎమ్మెల్యేలపై వత్తిడి తెస్తున్నాయి. మొత్తం మీద బదిలీల ప్రక్రియపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ప్రజల సమస్యలు పరిష్కారం కావనే చెప్పాలి. బదిలీలపై ప్రభుత్వ స్పష్టత కోసం ప్రజా ప్రతినిధులు.. అధికార యంత్రాంగం బాధిత ప్రజలు ఎదురు చూస్తున్నారు. బదిలీలపై త్వరతగతిన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

- వైసీపీ నేతల చేతిలోనే యంత్ర పరికరాలు
- గ్రూపుల ఎంపికలో గతంలో ఇష్టారాజ్యం
- క్షేత్రస్థాయిలో యూనిట్ల పరిస్థితిపై ఆరా
- నివేదిక రూపకల్పనలో నిమగ్నమయిన యంత్రాంగం

రాయితీ ఎవరికిచ్చారు!

రాయితీ యంత్రాలను రైతులకు అందించే విషయంలో దాదాపు మూడేళ్ల పాటు మాటలతోనే సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లు మాత్రం హడావిడి చేసింది. రైతులకు వ్యక్తిగతంగా సాగు పనిముట్లు అందించే అంతకు ముందు ప్రభుత్వ విధానాన్ని కాలదన్ని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల పేరిట గ్రూపుల విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో కూడా అనేక పిల్లిమొగ్గలు వేసిన అనంతరం ఆచరణలోకి తెచ్చింది. ఇక్కడా రాజకీయమే ప్రధానంగా నడుపుతూ అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టి వైసీపీ నేతాగణం అనుచరులకే లబ్ధి చేకూర్చే విధంగా గ్రూపులను ఎంపిక చేసి రాయితీ యంత్రాల ఉద్దేశ్యాన్నే నీరుగార్చిందనే విమర్శలు ఉన్నాయి. మంజూరు చేసిన యూనిట్లలో దాదాపు 50 శాతం గ్రూపులు అసలు రైతులే కారని వారంతా వేర్వేరు రంగాల్లో స్థిర పడినప్పటికీ వైసీపీ నేతల సిఫారసుతో లబ్ధి పొందారనే ఆరోపణను గతంలో టీడీపీ చేసింది. పలు గ్రామాల్లో రైతులు కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ రాయితీ యంత్రాల యూనిట్ల బాగోతంలో జరిగిన అవకతవకలపై కదలిక వచ్చింది. ఎన్ని గ్రూపులకు పరికరాలు ఇచ్చారు, ప్రస్తుతం ఆ పరికరాలు నిబంధనల ప్రకారం రైతుసేవా కేంద్రాలలోనే ఉన్నాయా అనే అంశంతోపాటు లబ్దిదారుల జాబితాను కూడా పంపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి మౌఖిక ఆదేశాలు ఇప్పటికే జిల్లా అధికారులకు అందాయి.

బాపట్ల, జూలై16(ఆంధ్రజ్యోతి): 2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన సాగు పనిముట్లను రాయితీపై వ్యక్తిగతంగా అందించేది. అందుకు సంబంధించిన విధివిధానాలపై కూడా పూర్తి స్థాయిలో స్పష్టత ఉండడంతో రైతులకు పెద్ద ఎత్తున మేలు జరిగేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్లు పూర్తిగా రాయితీ యంత్ర పరికరాలు అందించే విధానానికి స్వస్తి పలికింది. చివరి రెండేళ్లలో మాత్రం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ల పేరిట రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి రాయితీ పరికరాలను అందించి వాటిని రైతుసేవా కేంద్రాలు (అప్పట్లో రైతుభరోసా)లో ఉంచి నామమాత్రపు అద్దె ప్రాతిపదికన రైతులకు అందించాలని నిర్ణయించింది. ప్రకటన అయితే ఇచ్చింది తప్ప మార్గదర్శకాల విషయంలో పలుమార్లు పిల్లిమొగ్గలను వైసీపీ ప్రభుత్వం వేసింది. రైతులకు అత్యంత అవసరమైన ట్రాక్టరును రాయితీ నుంచి మినహాయించడంతో అవాక్కవడం రైతుల వంతయింది. తర్వాత దానిని చేర్చింది. దీంతో పాటు యంత్రాలు అందించే కంపెనీల వారికి బిల్లులు పెండింగ్ పెట్టడంతో యంత్రాల సరఫరాకు వారు సైతం ఆసక్తి చూపలేదు. ఇలా అనేక బాలారిష్టాలను దాటి ఇచ్చిన అరకొర యూనిట్లు సైతం వైసీపీ వారికి ఇచ్చి మమ అనిపించిన ఘనత వైసీపీది.

దేనిపైనా స్పష్టత లేకుండా..

రాయితీ యంత్రాలను రైతులకు అందించే విషయంలో దేనిపైనా స్పష్టత లేకుండా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించడంతో ఐదేళ్ల పాటు అన్నదాతలు ఎన్నో అగచాట్లు పడ్డారు. ఆయా గ్రూపుల ద్వారా రాయితీ యంత్రాలు పొందిన వారు వాటిని రైతు సేవా కేంద్రాలలో ఉంచితే అక్కడ నుంచి అద్దె ప్రాతిపదికన కావాల్సిన రైతులు తీసుకెళతారని ప్రభుత్వం చెప్పింది. కానీ అద్దెఎంత, పర్యవేక్షించే దెవరు అనే అంశంలో అంతా గందరగోళమే తప్ప స్పష్టత కొరవడింది.

వైసీపీ నేతల ఇళ్ల వద్దే...


ఆదేశాలలో మాత్రమే పరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలని చెప్పేవారు. కానీ ఆచరణలో మాత్రం ఆ పరికరాలన్నీ కూడా వైసీపీ నేతల ఇళ్ల వద్దే ఉండేవి. హక్కుగా వాటి ప్రయోజనాలను పొందాల్సిన రైతులు అలా కాకుండా వైసీపీ నేతల ఇళ్ల ముందు పడిగాపులు పడే విధంగా చేశారు. ఇక అద్దె విషయంలో కూడా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా అడిగే వారే కరువయ్యారు. పక్షపాత ధోరణితో ఈ వ్యవహారం నడిచేది. వైసీపీతో అంటకాగితే ఒకలా, లేకుంటే మరోలా ఈ అద్దె ఉండేది. టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర ఉన్న రైతుల విషయంలో అయితే ఈ అద్దెను అమాంతం రెండు మూడు రెట్లు పెంచి నిలువునా దోచేశారు. దేనికీ లెక్కాపత్రం ఉండేదికాదు, పర్యవేక్షించే వ్యవస్థలు కూడా లేకపోవడంతో రాయితీ యంత్రాలు కాస్తా రాజకీయ యంత్రాలుగా మార్చి ఇష్టారీతిన వైసీపీ నేతలు దోచేశారు

సమగ్ర విచారణ దిశగా...

రాయితీ యంత్రాల విషయంలో సమగ్ర విచారణ చేసే దిశగా యంత్రాంగం అడుగులేస్తోంది. ముందుగా జిల్లాల్లో జారీ చేసిన యూనిట్లలో సభ్యులుగా ఉన్నవారెవరు అనే అంశంపై పూర్తి స్థాయిలో దృష్టిసారించారు. వీరంతా అసలు రైతులా.. కాదా అనే దానిపైనే తొలుత విచారణ జరగనుంది. గ్రూపు సభ్యులు అందుకున్న పరికరాలు ఇళ్ల వద్ద కాకుండా రైతు సేవా కేంద్రాలలో ఉంచాలనేది నిబంధన. అలా కాకుండా సొంత ఆస్తిలాగా ఇన్నిరోజులూ ఇళ్ల వద్దనే ఉంచుకుని రైతులను ఇక్కట్లకు గురిచేశారు. ప్రభుత్వం వైపు నుంచి విచారణ చేసే దిశగా కదలిక రావడంతో పరికరాలను ఆయా కేంద్రాల వద్ద ఉంచి వెళుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరికరాలు సభ్యులకు అందిన దగ్గర నుంచి నామమాత్రపు అద్దె ప్రాతిపదికన ఎంతమందికి ఇచ్చారు, ఎంతమంది రైతులకు లబ్ధి చేకూర్చారు అనే వాటిపై కూడా పూర్తి విచారణ చేసి నివేదిక సమర్పించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు

కొన్ని యంత్రాలు అసలు లేవని...

ఒక్కో గ్రూపునకు 5 నుంచి 15 లక్షల విలువైన యంత్రపరికరాలను అందించారు. యంత్రాల కోసం గ్రూపులకు అందించే రుణాలలో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం వాటాను ప్రభుత్వం సబ్సిడీ రూపంలోనూ, మిగిలినది ఆయా గ్రూపు సభ్యులే భరించాల్సి ఉంటుంది. వీటిని గ్రామంలోని రైతుల అవసరాల కోసం అద్దె ప్రాతిపదికన అందించాలే కానీ ఇతరత్రా చేయకూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన అధికారులకు విస్తుపోయే అంశాలు అనుభవంలోకి వస్తున్నాయి. ఆయా గ్రూపు సభ్యుల జాడ కనిపించడంలేదు. దీంతో ఏదో మొక్కుబడిగా పేర్లు చేర్చి ఆ సబ్సిడీని వైసీపీ నేతలే కొట్టేశారా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఇక పరికరాలు కూడా అన్నీ కనిపించడం లేదని, దాదాపు ప్రతి గ్రూపులో ఒకట్రెండు యంత్రాలు మిస్సింగ్ కనబడుతున్నాయని వాటినేమన్నా బయటి వ్యక్తులకు అమ్మారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అర్హులు కాకుండా లబ్ది పొందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ముందుకెళతామని యంత్రాంగం చెబుతోంది.



సగం యూనిట్లు వైసీపీ వారి చేతిలోనే..

బాపట్ల జిల్లాలో మొత్తం 410 రైతు సేవా కేంద్రాలుఉండగా రాయితీ యంత్రాలను దఫాల వారీగా అందించింది 270 కేంద్రాలలో మాత్రమే. ఇందులో కూడా అన్నదాతలకు అవసరమైన ట్రాక్టరును మినహాయించి ఇచ్చిన యూనిట్లే ఎక్కువ. 270 యూనిట్లలో దాదాపు 120కు పైగా వైసీపీ నేతల అనుచరుల చేతిలోనే ఉన్నట్లు సమాచారం. అదే విధంగా గుంటూరు జిల్లాలో మొత్తం 249 కేంద్రాలుండగా దాదాపు 205 కేంద్రాల్లో యూనిట్లు ఉంచినట్లు గతంలో వ్యవసాయశాఖ తెలిపింది. ఇందులో 50 శాతం వైసీపీకి కొమ్ముకాసిన వారే లబ్ధిదారులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 421 రైతు సేవా కేంద్రాలు ఉండగా 290 సెంటర్లలో రాయితీ యంత్రాలు ఉంచారు. ఇక్కడ కూడా చాలా చోట్ల ట్రాక్టరు లేకుండానే మమ అనిపించగా సగం కేంద్రాలలో అసలు రైతులే లబ్ధిదారులుగా లేరని తెలుస్తోంది.

ప్రాధాన్యత రంగాలకు అధిక రుణాలివ్వాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వెంకటమురళీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, జూలై 16 : ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలివ్వాలని కలెక్టర్ జే వెంకటమురళీ కోరారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆమోదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలోని రైతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి వ్యవసాయ రుణాలివ్వాలన్నారు. ప్రాధాన్యత, ప్రాధాన్యతలేని రంగాలకు కలిపి మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 13,443.60 కోట్ల రూపాయలు రుణాలివ్వాలని రూపొందించిన ప్రణాళికను ఆమోదిస్తున్నట్లు కలెక్టర్, కమిటీ ఛైర్మన్ వెంకటమురళీ ప్రకటించారు. ప్రణాళికలో ప్రాధాన్య రంగాలకు 11,719 కోట్ల రూపాయలు రుణాలివ్వాలని చెప్పారు. ప్రాధాన్యం లేని రంగాలకు 1,724 కోట్ల రూపాయలు ఇవ్వాలని వివరించారు. వ్యవసాయానికి 10,053 కోట్లరూపాయల రుణాలు ఇవ్వాలన్నారు. సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు 1,153.33 కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. విద్యా రుణాలు, గృహనిర్మాణాలు, విద్యుదీకరణ, సామాజిక అవసరాలు తదితర ప్రాధాన్య రంగాలకు 512 కోట్ల రూపాయలు ఇవ్వాలన్నారు. వార్షిక ప్రణాళికను తక్షణమే అమలులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

- బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి 20,272 కోట్ల రూపాయలు రుణాలు అందించినట్లు కలెక్టర్ చెప్పారు. అందులో వ్యవసాయ రంగానికి 12,792 కోట్లు కాగా పరిశ్రమలకు 1,611 కోట్లు, ఇతరప్రాధాన్యత రంగాలకు 921కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు 4,947 కోట్ల రూపాయలు రుణాలిచ్చినట్లు వివరించారు. బాపట్లజిల్లాలో 28 బ్యాంక్‌లు పనిచేస్తున్నాయన్నారు. ప్రధానంగా సీసీఆర్‌సీకార్డులు జారీ చేసి రుణసదుపాయం కల్పించాలన్నారు. యాంత్రిక పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు.
- ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం గడిచిన ఆర్థిక సంవత్సరంలో 10,743 కోట్ల రూపాయలు రుణం ఇవ్వాలని లక్ష్యం కాగా 12,792 కోట్ల రూపాయల రుణాలు పంపిణీ జరిగిందని కలెక్టర్ అన్నారు. గత ఏడాది లక్ష్యాలకు మించి రుణాలివ్వటంపై అభినందించారు. లక్ష్యాలను చేరుకోవటంతోపాటు నిర్దేశించి అన్నిరంగాలకు రుణాలు 100శాతం చేరాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి అవసరమైన నగదు ముందుగా సిద్ధం చేసుకోవాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీఎస్టీలు అధికంగా ఉన్నందున సామాజికవర్గాలకు లక్ష్యం మేరకు రుణాలు చేరేవిధంగా చూడాలన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు అధికంగా ఉన్నాయని వాటిని గుర్తించి సదరు ఖాతాదారులకు వాటిని చెల్లించాలన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వాలి
: ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వ్యవసాయ రంగానికి బ్యాంకర్లు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని పోత్సహిస్తూ బ్యాంక్ అధికారులంతా సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీఎస్టీ సామాజిక అభివృద్ధికి రుణసదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బీ సుబ్బారావు, లీడ్ బ్యాంక్ కన్వీనర్ మాధురి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, నాబార్డు డీడీఎమ్ రవికుమార్, ఆర్‌బీఐ నవీన్, వివిధ బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు, పోలీసుల సహకారం మరవలేం

ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీలు వకుల్ జిందాల్, మాలికా గార్గ్‌ను సత్కరించి మెమోంటో అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల,జూలై 16 : జిల్లా ప్రజలు, పోలీసు యంత్రాంగం అందించిన సహకారం మరువలేమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బాపట్ల జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత ఎస్పీగా మొట్టమొదటిగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్ 2 సంవత్సరాల 4 నెలలు సేవలందించి ప్రజల మన్ననలను పొంది బదిలీపై విజయనగరం జిల్లా వెళుతున్న ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమన్నారు. బదిలీలలో భాగంగా విజయనగరం వెళుతున్నప్పటికి ఇక్కడ సేవలను ఎన్నడూ మరువలేనన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో, క్లిష్టమైన బందోబస్తు నిర్వహించటంలో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో పోలీసు శాఖకు కావాల్సిన ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయాన్ని, పెరేడ్ గ్రౌండ్, సీసీఎస్ పోలీసుస్టేషన్, డాగ్‌కెన్నల్‌లను ఇక్కడ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల విధులు, రోడ్డుప్రమాదాల నియంత్రణ, తీరంలో పర్యాటకుల రక్షణ నిమిత్తం గజఈతగాళ్ళను ఏర్పాటు చేయటం, నాటుసారా, గంజాయి నియంత్రణకు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరి కృషి వల్ల సాధ్యమైందన్నారు. దీనికి హోమ్‌గార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ వరకు ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బదిలీలు సర్వసాధారణమని అందరినీ వదిలి వెళ్ళటం బాధగా ఉందని బావోద్వేగానికి లోనయ్యారు.

- పోలీసు పేరెడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ముందుగా ఎస్పీ పేరెడ్ కమాండర్‌గా వ్యవహరించిన మౌలుద్దీన్ నుంచి గౌరవవందనం స్వీకరించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పేరెడ్ పరిశీలన చేశారు. అనంతరం ప్లటూన్‌ల వారిగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి పోలీసు అధికారులు ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌ను పోలీసు అధికారులు భుజాలపై ఎత్తుకొని ప్రదర్శించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ విధంగా పోలీసు సిబ్బంది తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు ఎస్పీ మాలికాగార్గ్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఎఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల వ్యవసాయ కళాశాల అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని రాజమండ్రి ఐటీసీ లిమిటెడ్ సీనియర్ లీడ్ సైంటిస్ట్, కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ బి.ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాల 79వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం కళాశాలలోని డాక్టర్ బీవీనాథ్ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ కళాశాల పూర్వ విద్యార్థిగా తాను కష్టపడే తత్వం, పట్టుదల లాంటి లక్షణాలు ఈ ప్రాంగణంలోనే నేర్చుకున్నానని చెప్పారు. తర్వాత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలను డాక్టర్ బీ.ఎస్.రామచంద్రరెడ్డి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ గాజుల రామచంద్రరావు అందజేశారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి



మాట్లాడుతున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, జూలై 16 : ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగ వెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోర్టు భవనాల సముదాయంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, వాహనచోదకులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన మరింత పెంచాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సీత, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రియదర్శిని పాల్గొన్నారు.

18న ర్యాలీ

హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలపై వాహనచోదకులకు మరింత అవగాహన పెంచేందుకు గురువారం ఉదయం 9-15 గంటలకు అద్దంకి కోర్టు భవనాల సముదాయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి తెలిపారు. ప్రజలు, వాహనచోదకులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు

నిల్వలు, నాణ్యత లేని ఆహార పదార్థాల గుర్తింపు

రెండు థియేటర్ల క్యాంటీన్‌లపై కేసు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

చీరాలటౌన్, జూలై 16 : ప్రజలకు అందించే ఆహార పదార్థాలలో నాణ్యత, జాగ్రత్తలు పాటించకుంటే అనుమతులు రద్దు చేయడమే కాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆహార భద్రత అధికారులు హెచ్చరించారు. చీరాల పట్టణం నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మంగళవారం సురేష్ మహల్, మోహన్ సినిమా థియేటర్‌లలో క్యాంటీన్‌లను ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రభాకరరావు, ప్రణీత్‌కుమార్ తనిఖీ చేశారు. టీపీసీ పరికరం ద్వారా క్యాంటీన్‌లో అమ్ముతున్న ఆహార పదార్థాలను పరీక్షించారు. వాటిలో పెద్ద ఎత్తున లోపం ఉన్నట్లు గుర్తించారు. దీంతో రెండు క్యాంటీన్‌లపై కేసులు నమోదు చేశారు. సంబంధిత యజమానులకు నోటీసులిచ్చారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశుభ్రత, నాణ్యతతో ఆహార పదార్థాలను ప్రేక్షకులకు అందించాలన్నారు. విధిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి ఉండాలన్నారు. తాగునీరు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. శాంతి థియేటర్ మరమ్మతుల కారణంగా మంగళవారం వినియోగంలో లేకపోవడంతో అక్కడ తనిఖీలు చేయలేదు.

మేదరమెట్లలో జోరుగా ఆక్రమణలు

పంచాయతీ పర్మిషన్ లేకుండానే నిర్మాణాలు



అనుమతులు లేకుండా నిర్మించిన దుకాణం

మేదరమెట్ల, జూలై 16 : ప్రభుత్వ భూములను ఎక్కడికక్కడ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే భవనాలు నిర్మించి దుకాణాలను నడుపుతున్నారు. మేజర్ పంచాయతీ మేదరమెట్లలో విలువైన ప్రభుత్వ భూములను పలువురు ఆక్రమించి ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వ్యవసాయేతర భూమిగా మార్చకుండా, నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు చెల్లించకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ ఆక్రమణల నుంచి రెవెన్యూ అధికారులకు తెలిసిన పట్టనట్లు వదిలేశారు. ఎన్నికలకు ముందు వైసీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన నాయకుడి అండదండలతో కబ్జాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకుల అండతో రెచ్చిపోయిన అక్రమార్కులు మరింత విస్తరించారు. జాతీయ రహదారికి, రాష్ట్రీయ రహదారికి దగ్గరలో ఉన్న 751 సర్వే నెంబరులో ఇటువంటి ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు పంచాయతీలో ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతులు లేకపోయినప్పటికీ ఇటీవల మరింత విస్తరించి నిర్మాణాలు చేపట్టారు. తమ్మవరం రోడ్డులో ప్రభుత్వ భూములు రేకుల షెడ్‌లు వేసి ఆక్రమించుకున్న రెవెన్యూ అధికారులు మిన్నకుండి పోయారు. మేదరమెట్లలో ప్రభుత్వ భూమి చాలా తక్కువ ఉంది. ఉన్న కొద్ది భూమి ఆక్రమణలకు గురైంది. ప్రభుత్వ భూమి కబ్జాకు గురికావడంలో రెవెన్యూ అధికారుల పాత్ర ఎంతైనా ఉంది. ఈ దందాలో వైసీపీ నాయకుల అండతో పాటు పెద్దమొత్తంలో ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి మేదరమెట్లలో ప్రభుత్వ భూములలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పంచాయతీ అనుమతులు లేవు
లక్ష్మీకాంత్, పంచాయతీ కార్యదర్శి

751వ సర్వే నెంబరులో ఏర్పాటు చేసిన షాపులకు పంచాయతీ అనుమతులు లేవని తెలిపారు. పంచాయతీలో ఎటువంటి ప్లాన్ అప్రూవల్ కాని, నిర్దిష్ట రుసుం చెల్లింపులు జరగలేదు.


4 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

అద్దంకి, జూలై 16 : బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న 4 ఇసుక ట్రాక్టర్ల ను మంగళవారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మోదేపల్లి సమీపంలో చిలకలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ఇసుక ట్రాక్టర్‌లను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అలాగే చక్రాయపాలెం సమీపంలో గుండ్లకమ్మ నది నుంచి ఇసుక తరలిస్తు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

జూదరుల అరెస్టు

విప్పర్లవారిపాలెంలో మంగళవారం పేకాడుతుండగా 7 గురుని అదుపులోకి తీసుకొని రూ.4,540 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

వెల్లలచెరువులో శ్మశాన భూమి ఆక్రమణకు యత్నం



వివాదంలో ఉన్న భూమి

సంతమాగులూరు, జూలై 16 : మండలంలోని వెల్లలచెరువు గ్రామం లో విశ్వబ్రాహ్మణులకు చెందిన శ్మశాన వాటికను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. వెల్లలచెరువు గ్రామంలో విశ్వబ్రాహ్మణుల మరణానంతరం వారికి పితృకర్మలు నిర్వహించి అనంతరం నందులు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఇవన్నీ నిర్వహించుకునేందుకు సుమారు 50ఏళ్ల కిందట గ్రామానికి పడమర వైపు ఉన్న చెరువు పక్కన కొంత స్థలాన్ని కేటాయించారు. అప్పటి నుంచి అక్కడే వారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ స్థలం మా పూర్వీకులది అని చెప్పి శ్మశాన స్థలాన్ని చదును చేశారు. గ్రామంలోని విశ్వబ్రహ్మణుల సమస్యను పరిష్కరించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

మళ్లీ సిట్..!

ఆ దిశగా పడుతున్న అడుగులు
ఒంగోలులో వైసీపీ నాయకులు
రూ.101 కోట్ల ఆస్తులు కొట్టేశారన్న సీఎం
విచారణ చేయిస్తామని అధికారిక ప్రకటన
నకిలీ పత్రాలతో పెద్దఎత్తున భూములు కబ్జా
వేలాదిమంది బాధితులు ఇప్పటికే ఫిర్యాదు
పలు కేసుల నమోదు.. తర్వాత చర్యలు కరువు
మళ్లీ విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం
పోలీసు శాఖలోనూ ఇదే హాట్ టాపిక్



దొరికిన నకిలీ స్టాంప్స్, పత్రాలు(ఫైల్)

ఒంగోలు(క్రైం), జూలై 16 : నకిలీపత్రాలతో భూఅక్రమాలకు పాల్పడిన అక్రమార్కులకు వణుకుపుట్టించే వార్త. సిట్‌ను మళ్లీ తెరిచేందుకు అధికారపార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి ప్రకటనే అందుకు ఊతమిస్తోంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తర్వాత గత ప్రభుత్వం హయాంలో జరిగిన అక్రమాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం సహజ వనరుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేస్తూ ఒంగోలులో రూ.101 కోట్లు విలువైన ఆస్తులను కొట్టేశారు అని ఆరోపించారు. అంతేకాకుండా ఈ దోపిడీలో వైసీపీకి చెందిన నాయకులు, సానుభూతిపరులు, కొందరు అధికారులు కలిసి నకిలీ పత్రాలు సృష్టించి ప్రైవేటు, ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు అని సీఎం నేరుగా పేర్కొన్నారు. ఇలాంటి వారిని విచారించి కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా ఇటీవల అనేకమార్లు భూబాగోతాలపై మళ్లీ సిట్ వేసి తిరిగి విచారణ చేయిస్తామని, బాధితులకు తిరిగి భూములు ఇప్పిస్తామని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ కూడా తిరిగి సిట్‌ను మళ్లీ తెరిచి భూకుంభకోణంలో ఉన్న పెద్ద తలకాయలను బయటపెట్టి జైలు పంపుతామని తేల్చిచెప్పారు. ఇలా మొత్తంగా ఒంగోలులో జరిగిన భూకుంభకోణాల వ్యవహారం తిరిగి తెర మీదకు వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ఎస్పీ దామోదర్‌కు పెను సమస్యగా భూకుంభకోణమే ఉందని చెప్పవచ్చు.

నకిలీ భూకుంభకోణంలో అంత వైసీపీ నేతలే

గత ఏడాది ఒంగోలులో లాయర్‌పేట ఎక్స్‌టెన్స్‌లో ఓ ఇంటిపై దాడిచేసి పెద్దమొత్తంలో స్టాంపులు, దస్తావేజులు, వివిధ అధికారుల రబ్బరు స్టాంపులు, జిరాక్స్ పేపర్లు, ప్రభుత్వ కార్యాలయాలలో ఉండాల్సిన సర్టిఫికెట్లు దొరికాయి. దీంతో ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సిట్ ఏర్పాటు చేసి నకిలీపత్రాలు, భూకుంభకోణాలపై విచారణ చేశారు. అయితే తీగలాగితే డొంక కదిలినట్లు వైసీపీ నేతల భూదందాలు బయటకొచ్చాయి. వందలాది మంది బాధితులు సిట్ అధికారుల ముందుకొచ్చి ఫిర్యాదులు చేశారు. అయితే ఎక్కువశాతం వైసీపీ నేతల హస్తం ఉండటంతో విచారణ ముందుకు కదల్లేదు. పైగా అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లు కూడా సిట్‌పై బాగా పనిచేసిందనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నకిలీ పత్రాల సూత్రధారులు, భూకబ్జాలకు కారకులు ఎవరనేది తేల్చకుండా, నకిలీపత్రాలు తయారు చేసిన వారు, జిరాక్స్ తీసిన వారు, సాక్షి సంతకాలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారనే విమర్శలు వెల్లువెత్తాయి. వైసీపీ నాయకులపై వచ్చిన ఆరోపణలు పైకి పోకుండా సిట్‌లో పనిచేసిన అధికారులు చక్రం తిప్పి అందిన కాడికి దండుకున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా అక్రమమని తెలియక భూములను కొనుగోలు చేసిన అమాయకులు, వ్యాపారులను బెదిరించి భారీగా వసూలు చేశారనే ప్రచారం ఆరోపణలు వచ్చాయి.

> మళ్లీ సిట్ తెరపైకి వస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించాక దానిని ఏర్పాటు చేసే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో నకిలీ పత్రాలు సృష్టించి కోట్లు విలువ చేసే ప్రైవేటు, ప్రభుత్వ భూములను ఆక్రమించారు. అలాగే అమాయకులకు అమ్మేసి భారీగా సొమ్ముచేసుకున్నారు. ముఖ్యంగా ఒంగోలు ప్రాంతంలో అత్యంత విలువైన భూములు కబ్జాదారుల కబంధహస్తాలలో చిక్కుకుపోయాయి. రాజకీయ నాయకుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఇలాంటి అక్రమార్కుల చేతుల్లో చిక్కి విలవిలలాడుతున్నారు. గత ప్రభుత్వం హయంలో జరిగిన అక్రమాలపై వేసిన సిట్ దర్యాప్తు సక్రమంగా జరగలేదనే చెప్పవచ్చు. వైసీపీ నాయకుల అండదండలు ఉండటంతో సూత్రధారులను వదిలేసి కేవలం పాత్రధారులను జైళ్ల పాలు చేశారనే విమర్శలు ఉన్నాయి. అలాంటి వారిపై ఇప్పుడు ఉక్కుపాదం మోపేందుకు రంగం సిద్ధమవుతోంది.

సిట్ తెరిస్తే ఎలా..?

దారు రోజులుగా సిట్ వ్యవహారం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే దామచర్ల పదేపదే అక్రమార్కుల అంతుతేలుస్తానంటూ సీరియస్‌గా ప్రకటనలు చేస్తున్నారు. అలాగే పోలీసు అధికారులు మారిపోతున్నారు. నూతన అధికారులు కొలువుదీరితే సిట్ వేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో రెచ్చిపోయిన అక్రమార్కుల వెన్నులో వణుకుపుడుతోంది. ముఖ్యంగా ఆ కుంభకోణంలో ఉన్న వైసీపీ కీలక నేతలు, ప్రజాప్రతినిధులు విచారణ జరిగితే తమ పరిస్థితి ఏమిటని ఆలోచనలో పడినట్లు సమాచారం. సిట్ వ్యవహారం పోలీసు శాఖలోనూ చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు తీసుకోనున్న ఎస్పీ దామోదర్ సిట్ వ్యవహారం, కేసులు విచారణ తీరుపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

కొన్ని కేసులలో అడుగు ముందుకు పడలేదు

జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతోపాటుగా గుంటూరు రేంజి పరిధిలో ఉన్న పోలీసు అధికారులు సైతం సిట్‌లో పనిచేశారు. ఇప్పటికి కొంత మంది వద్ద కేసుల విచారణ పెండింగ్‌లోనే ఉన్నాయి. మూడు నెలలపాటు జిల్లాలో సిట్ పేరుతో పోలీసులు సిరులు పండించారు. ముఖ్యంగా తాలూకా స్టేషన్ కేంద్రంగా పండగ చేశారు. ఎన్నికలు దగ్గరపడటంతో సిట్‌ను తాత్కాలికంగా మూసివేసి ఆ విధులకు హాజరయ్యారు. అయితే వైసీపీ నేతలు చేసిన భూకబ్జాల విషయం ఎక్కడా బయటకు రాలేదని అప్పట్లో తెలుగుదేశం నాయకులు బహిరంగ విమర్శలు చేశారు. నకిలీ కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన పెద్ద నేత అనుయాయులు కనిపించకుండా పోయారు. పోలీసులు కూడా వైసీపీ నేతలు, వారు సిఫార్సు చేసిన కేసుల విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరించారు. అదేసమయంలో భూఅక్రమాలలో నేరుగా పాత్రధారులైన కొంతమంది వైసీపీ నాయకులు నెలలపాటు ఒంగోలు వదిలి వెళ్లిపోయారు. అయితే వారివైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. కాగా గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన కొందరు అధికారులు అక్రమార్కులకు ముందే అన్ని విషయాలు తెలిపి, ఒంగోలు నుంచి పంపివేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది.

మీ ఇష్టం.. పోతేపోండి!

వైసీపీలో ఉంటే మీకోసం పోరాడతా
ఒంగోలు నగర కార్పొరేటర్ల తీరుపై మాజీమంత్రి బాలినేని



మాట్లాడుతున్న బాలినేని

ఒంగోలు, జూలై 16 : ఉండాలని ఉంటే ఉండండి.. లేకుంటే మీఇష్టం.. ఉంటే మీకోసం పోరాడతా అంటూ పార్టీ మారాలనుకుంటున్న కార్పొరేటర్లకు మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టత ఇచ్చారు. స్థానిక లాయర్‌పేటలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్లు పార్టీలో ఉంటామని తనకు చెప్పారని తెలిపారు. తనతో ఉంటే వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. పార్టీ మారాలా? వద్దా? అనేది వారి ఇష్టమని తేల్చిచెప్పారు. తాను భూకబ్జాలకు పాల్పడినట్లు ఎన్నికల ముందు ప్రచారం చేశారని, వారి చేతిలోనే అధికారం ఉందని, విచారణ చేసుకోవచ్చని తెలిపారు. అతనిపై తనకు నమ్మకం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లు విచారణ చేయించాలని కోరారు. స్థలాలు కొనుగోలు విషయంలో రైతుల వద్ద ఒక్క రూపాయి తీసుకున్నానని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. తన కోడలు మీద అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని, తన కొడుకుతో తిరిగే వాళ్లను గంజాయి బ్యాచ్ అంటున్నారన్నారు. వైసీపీ అధినేత జగన్ కరెక్టుగా చేయకపోవడంతో ప్రశ్నించానని, దాంతో కొన్ని ఇబ్బందులు పడ్డానని తెలిపారు. సాఫ్ట్‌గా ఉండే తనను కొంతమంది చికాకు పెడుతున్నారన్నారు. సొంత పార్టీలో కూడా ఇబ్బందులు పడ్డానని, కొంతమంది బయటి వ్యక్తులతో కలిసి పార్టీ వాళ్లే సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయించారన్నారు. త్వరలో ఆ విషయాలను కూడా బయటపెడతానని తెలిపారు.

హైస్కూలు ప్లస్‌లో బోధన సిబ్బంది నియామకం

ఒంగోలు(విద్య), జూలై 16 : జిల్లాలోని హైస్కూలు ప్లస్‌లో బోధన సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. హైస్కూలు ప్లస్ ఫెయిల్ శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు జిల్లాలోని తొమ్మిది హైస్కూలు ప్లస్ బాలికా జూనియర్ కళాశాలలకు అవసరమైన మేరకు బోధన సిబ్బందిని నియమించామన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో కొత్తగా మంజూరైన 11 కోఎడ్యుకేషన్ హైస్కూలు ప్లస్‌కు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హైస్కూళ్లు, యూపీ స్కూళ్లలో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లు, సబ్జెక్టు టీచర్లలో అర్హులైన వారిని పని సర్దుబాటు విధానంలో హైస్కూలు ప్లస్‌లలో నియమించమని ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. హైస్కూలు ప్లస్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు ఉత్తర్వులు జారీచేశామన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగ్‌లు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ విద్యాసంవత్సరమే పంపిణీ చేసేందుకు ఎంఈఓలు చర్యలు తీసుకోవాలన్నారు.

ఒంగోలులో రూ.101 కోట్ల విలువైన భూ ఆక్రమణ

వైసీపీ పాలనలో అక్రమాల శ్వేతపత్రంలో సీఎం బాబు వెల్లడి
గ్రానైట్ క్వారీలలో తనిఖీలపైనా ప్రస్తావన

ఒంగోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో గత వైసీపీ పాలనలో దాదాపు రూ.101 కోట్ల విలువైన భూములు ఆక్రమణలు జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వ కాలంలో భూములు, గనులు, ఆటవీ ఇతర సహజవనరుల దోపిడీపై రాష్ట్రప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం శ్వేతపత్రం విడుదల చేశారు. అందులో ఒంగోలులో భూఆక్రమణలు, అక్రమాలు, వైసీపీ నేతల దందాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ సమయంలో వైసీపీ నేతలు రెచ్చిపోయి పెద్దఎత్తున పలుచోట్ల భూకబ్జాలకు పాల్పడ్డారు. ప్రధానంగా విశాఖ, తిరుపతి ప్రాంతాల్లో జరగ్గా అదే కోవలో ఒంగోలులోనూ జరిగాయి. అదే విషయాన్ని శ్వేతపత్రంలో సీఎం తెలిపారు. వైసీపీ నేతలు ప్రధానంగా కుటుంబ వివాదాల్లో ఉన్నవి, ఎవరి స్థలం అన్నది స్పష్టం లేని ప్రైవేటు స్థలాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను గుర్తించడం వాటికి వీలునామాలు, పార్టీషన్ డీడ్లు, కుటుంబసభ్యుల సర్టిఫికెట్లు, డీకే పట్టాలు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, విక్రయ దస్తావేజులు పెద్దఎత్తున నకిలీవి సృష్టించి సివిల్ వివాదాలు వచ్చేలా చేశారన్నారు. గుండాలు, అవినీతి అధికారుల అండదండలతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. అలా సుమారు రూ.101 కోట్ల విలువైన స్థలాలు, భూములు ఒంగోలులో ఆక్రమణలు జరగ్గా వైసీపీ నేతల కారణంగా 112 మంది బాధితులు తమ స్థలాలు, భూములను కోల్పోయినట్లు గుర్తించామన్నారు. ఈ వ్యవహారంలో 572 నకిలీపత్రాలు వాడినట్లు గుర్తించడంతోపాటు 77మంది నిందితులను అరెస్టు చేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల విలువైన స్థలాలు, భూములు అన్యాక్రాంతం కాగా వాటన్నింటిని విచారించి వాస్తవ హక్కుదారులకు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ తరహా భూ ఆక్రమణలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని కోరిన సీఎం లాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. సహజ వనరుల దోపిడీ అలాగేతమకు అనుకూలురైన వారికి లబ్ధిచేకూరేలా చేసిఖజానాకు నష్టం వచ్చేలా వైసీపీ ప్రభుత్వం చేసిన వాటిలో జిల్లాలోని గ్రానైట్ రంగాన్ని చేర్చారు. వైసీపీ ప్రభుత్వంలో 2019 -20 మధ్య ఉమ్మడి జిల్లాలో 115 గ్రానైట్ లీజులు ఉన్న క్వారీలలో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించి తమకు అనుకూలంగా లేని 23 క్వారీల వారికి రూ.614 కోట్లు పెనాల్టీలు వేసి క్వారీలు మూతవేయించారని, మిగతా వారి నుంచి వైసీపీ నేతలు లబ్ధి పొంది వారికి అనుకూలంగా వ్యవహరించారని తెలిపారు.

డ్వామా పీడీ అవినీతిపై విచారణ

జాయింట్ కలెక్టర్ విచారణాధికారి నియామకం
ఉద్యోగుల వినతిపై స్పందించిన కలెక్టర్ తమీమ్
సిబ్బంది రోడ్డెక్కడంతో కార్యాలయానికి రాని పీడీ


ఒంగోలు(కలెక్టరేట్), జూలై 16: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీ అర్జునరావు అవినీతిపై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణను నియమించినట్లు సమాచారం. డ్వామా అధికారిగా అర్జునరావు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మామూళ్ల కోసం వేధింపులకు పాల్పడటంతోపాటు మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ రోడ్డెక్కిన విషయం తెలిసిందే. డ్వామా ఉద్యోగులు తాము డ్వామా పీడీ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రం రూపంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి విన్నవించారు. ఉద్యోగులతో ఆయా అంశాలపై మాట్లాడిన కలెక్టర్ అన్సారియా పీడీ అవినీతికి సంబంధించి అంశాలపై ఆధారాలు ఉన్నాయా? అని ఉద్యోగులను ప్రశ్నించినట్లు సమాచారం. తమనే కాకుండా కొందరు ఎంపీడీఓలను వేధించినట్లు వివరించారు. క్లస్టర్ పరిధిలో సమీక్ష పేరుతో మండలం నుంచి నెలకు రూ.లక్ష మామూళ్లు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆయా ఉద్యోగులను టార్గెట్ చేసి అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆయా అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ తమీమ్ జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో సమగ్ర విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా డ్వామాలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేయడం పత్రికల్లో ప్రముఖంగా రావడంతో కలెక్టర్ స్పందించి అందుకు సంబంధించి పీడీ అర్జునరావును వివరణ కోరినట్లు సమాచారం. కాగా తమ శాఖలో పనిచేసే ఉద్యోగులు తనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడంతో మంగళవారం కార్యాలయానికి రాకుండా ఆయన ముఖం చాటేసినట్లు తెలిసింది. ఉద్యోగులు సమావేశమై ఆందోళనలు చేస్తారని తెలిసిన వెంటనే పీడీ అర్జునరావు అన్ని విభాగాల ఉద్యోగ ముఖ్యనాయకులతో మాట్లాడినట్లు సమాచారం. ఇక నుంచి అటువంటివి జరగకుండా చూసుకుంటానని తనపై ఆందోళనలు చేయవద్దని కోరినట్లు తెలిసింది. కానీ ఉద్యోగులు ఆ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని రోడ్డెక్కడంతో డ్వామా అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

మహిళ వద్ద బ్యాగ్‌ను లాక్కెళ్లిన దుండగులు

ఒంగోలు(క్రైం), జూలై16: స్కూటీపై ఇరువురు మహిళలు వెళుతుండగా గుర్తుతెలియని దుండగులు మోటార్‌సైకిల్‌పై వచ్చి వారి వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను లాక్కొని పరారీ అయ్యారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం బాపూజీ కాంప్లెక్స్‌లో జరిగింది. స్థానిక కమ్మపాలెంలో నివాసం ఉండే ఇరువురు మహిళలు షాపింగ్ చేసేందుకు బాపూజీకాంప్లెక్స్ వెళ్లారు. అయితే ఇరువురు దుండగులు మోటార్‌సైకిల్‌పై వచ్చి స్కూటీపై ఉన్న మహిళ వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్ లాక్కొని వెళ్లారు. బాగ్‌లో రూ.12వేల నగదు, రూ.లక్ష విలువ చేసే సెల్‌ఫోన్ ఉందని బాధితురాలు తెలిపారు. టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

తండ్రిపై కుమారుడు ఇనుప రాడ్డుతో దాడి

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని ఘాతుకం
వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సొమ్మసిల్లిన తండ్రి
ఆసుపత్రికి తరలించిన పోలీసులు



బాధితుడ్ని హాస్పిటల్‌కు తరలిస్తున్న దృశ్యం

చీరాలటౌన్, జూలై 16 : మద్యం తాగేందుకు తండ్రి డబ్బులు ఇవ్వలేదని ఇనుప రాడ్డుతో కుమారుడు దాడి చేశాడు. ఈఘటన మంగళవారం రాత్రి స్థానిక హారీస్ పేటలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. పేటకు చెందిన దేటా దావీదుకు మేరిబాబు కుమారుడు. ఇతను మద్యంకు పూర్తిగా బానిసగా మారిన మేరిబాబు గతకొద్ది రోజులుగా తండ్రిని వేధిస్తున్నాడు. ఈక్రమంలోనే రాత్రి సమయంలో మద్యానికి తండ్రిని డబ్బులు అడిగాడు. రోజువారీ కూలీ అయిన తండ్రి డబ్బులు లేవని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన కుమారుడు క్రూరంగా ఇనుప రాడ్డుతో తల వెనుక భాగంలో దాడి చేశాడు. ఈక్రమంలో తండ్రి బిగ్గరగా కేకలు వేయడంతో కుమారుడు పరారయ్యాడు. అయితే రక్త గాయంతోనే తండ్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. స్టేషన్ గేటు దగ్గరకు వెళ్లేలోపే సొమ్మసిల్లి కింద పడిపోయాడు. దీంతో పోలీసులు 108లో దావీదును చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.



నేడు రామకూరు కొండపై తొలి ఏకాదశి తిరునాళ్ల

పంగులూరు, జూలై 16 : మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవానికి తగిన ఏర్పాట్లు జరిగాయి. ప్రతి ఏటా ఎంతో వైభవోపేతంగా జరిగే తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవంలో రామకూరు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహిస్తారు. కొండమీద ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దివ్య సన్నిధానంలో బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయ గిరిప్రదక్షిణ, మెట్లపూజ, అనంతరం 11 గంటల 30 నిమిషాలకు స్వామివారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయమునకు విచ్చేసే వేలాదిమంది భక్తులకు కట్టె పొంగలి, లడ్డు, పులిహోర, మజ్జిగ అల్పాహారంగ అందించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు మంత్రి సమీక్ష

అద్దంకి, జూలై 16 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం అద్దరోడ్డు గెస్ట్‌హౌస్ వద్ద ఉదయం 10-30 గంటలకు సంతమాగులూరు మండలంలోని నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించనున్నారు. గ్రామాలవారీ సమస్యలను తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి పనులపై చర్చిస్తారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు.

చేప పిల్లల పెంపకం అస్తవ్యస్తం

- చిట్టడవిని తలపిస్తున్న చక్రాయపాలెం కేంద్రం
- శిథిలావస్థకు చేరి ఒడ్డు విరిగి పడ్డ ఊటబావి
- గత ఏడాది నిరుపయోగం





చక్రాయపాలెం వద్ద చిల్లచెట్ల మధ్య ఉన్న చేప పిల్లల పెంపక కేంద్రం.. చేపపిల్లలను పెంచే తొట్టెలు

అద్దంకి, జూలై 16 : జాలర్ల జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వ పలు రకాల పథకాల ద్వారా తోడ్పాటును అందిస్తున్నా నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఫలాలు లబ్ధిదారులకు అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జాలర్లకు సబ్సిడీపై వలలు, మో పెడ్‌లు, ఆటోలు అందజేశారు. అయితే గత 5 సంవత్సరాల కాలంలో జాలర్ల పట్ల వైసీపీ పాలకులు పూర్తి నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జాలర్లలో ఒకింత ఆశలు చిగురిస్తున్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులలో మార్పు రాకపోవటం జాలర్లలో ఆందోళన కలిగిస్తుంది. అద్దంకి నియోజకవర్గంలో భవనాసి చెరువుతో పాటు పలు చెరువులలో చేపల పెంపకం జరుగుతోంది. అదే సమయంలో గుం డ్లకమ్మ రిజర్వాయర్ ఆధారంగా కూడా సుమారు 2వేల మంది జాలర్లు చేపల వేట సాగిస్తున్నారు. గుం డ్లకమ్మ రిజర్వాయర్, చేపల చెరువులలో చేప పిల్లలను వదిలేందుకు అవసరమైన చేప పిల్లల ఉత్పత్తి కోసం అద్దంకి మండలం చక్రాయపాలెం సమీపంలో భవనాసి చెరువు అలుగు ఒడ్డున 4 దశాబ్దాల కిందట చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పట్లో నిర్లక్ష్యానికి గురై పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. గత 5 సంవత్సరాల కిందట పునర్‌నిర్మాణం చేశారు. ప్రస్తుతం కూడా అదే నిర్లక్ష్యం కొనసాగుతుండడంతో మరలా శిథిలావస్థకు చేరి మూత పడుతుందేమోనన్న ఆందోళన జాలర్లలో నెలకొంది. సాధారణంగా వేరే ప్రాంతాల నుంచి చిన్న సైజు చేప పిల్లలను తీసుకు వచ్చి చక్రాయపాలెం చేపల పెంపకం కేంద్రంలోని నీటి తొట్టెలలో జూలై, ఆగస్టులో చిన్న పిల్లలు తెచ్చి పోసి సుమారు 3 నెలల పాటు పెంచి సెప్టెంబరు, అక్టోబర్‌లో గుండ్లకమ్మ రిజర్వాయర్‌తో పాటు పలు చేపల చెరువులలో పిల్లలను వదిలేందుకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ కేంద్రంలో చేప పిల్లల పెంపకం విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతుందన్న విమర్శలు వస్తున్నాయి. గత నాలుగైదు సంవత్సరాలుగా మొక్కుబడిగా నిర్వహించగా, గత ఏడాది మాత్రం అసలు చేప పిల్లల పెంపకమే చేపట్టకపోవడం మరింత విమర్శలకు తావిస్తుంది. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోయి నీరు నిల్వ ఉండే అవకాశం లేదు కనుక చేప పిల్లలను వదిలే అవకాశం లేదు. అయితే భవనాసి చెరువుతో పాటు పలు చెరువులలో గత ఏడాది చేపల పెంపకం జరిగింది. చ క్రాయపాలెం చేప పిల్లల పెంపక కేంద్రం ఈ ఏడాది కూడా చేప పిల్లల పెంపకం చేపడతారా లేదా అన్న మీమాంస కొనసాగుతుంది. దీనికి తోడు చేప పిల్లల పెంపక కేంద్రం ఆవరణ మొత్తం చిట్టడవిని తలపించేలా ఉండడం, ఆవరణలో విచ్చలవిడి గా మద్యం బాటిళ్లు ఉండడం పరిశీలిస్తే నిర్వహణ ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అదే సమయంలో చేప పిల్లల పెంపక కేంద్రం తొట్టెలకు నీటిని అందించే ఊట బావి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఒడ్డు విరిగి పడిపోయింది. కనీసం మరమ్మతులు చేసే విధంగా కూడా అధికారులు ఆలోచించకపోవడం మరింత విమర్శలకు తావిస్తుంది. గత ఏడాది ఎలాగు చేప పిల్లల పెంప కం చేపట్టక పోగా కనీసం ఈ ఏడాది కూడా చేప పిల్లల పెంపకం చేపట్టే విధంగా ఇంకా అడుగులు వేయకపోవడం అనుమానాలకు తావిస్తుంది. అందుబాటులో చేప పిల్లలు పెంపక కేం ద్రంలో పిల్లల పెంపకం చేయకపోవడంతో జాలర్లు సుదూర ప్రాంతం నుంచి ఎక్కువ రేటు కు కొనుగోలు చేసి, అధిక వ్యయ ప్రయాసలకు ఓర్చి తెచ్చుకోవాల్సి వస్తుందని జాలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చక్రాయపాలెం చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జాలర్లు కోరుతున్నారు.



ఒడ్డు విరిగి పడి ఉన్న ఊటబావి



రామానగర్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మురుగు కాలువలు లేక అవస్థలు

చీరాల, జూలై 16 : మున్సిపల్ పరిధిలోని శాంతినగర్, రామానగర్ మధ్య వర్షపు నీరు రోడ్డుపై నిలబడటంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ సౌకర్యం లేక చిన్న పాటి జల్లు పడినా ఆ ప్రాంతంలో రోడ్డు చెరువును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో వర్షం కురిసి మూడు రోజులు అయింది. నేటికీ అక్కడ రోడ్డు తటాకాన్ని తలపిస్తోంది. దీంతో భారీ వాహనాలు ఆరోడ్డు వెంట వెళ్లేప్పుడు నీళ్ల చింది డివైడర్ దాటి రెండో వైపు రోడ్డులో వెళ్లేవారిపై కూడా పడుతున్నాయి. ఇక పాదచారుల ఇక్కట్లు చెప్పేవి కావు. ఆ ప్రాంతంలో కొందరు ఇళ్లలో నుంచి వెలుపలకు రావాలంటే నిలిచిన వర్షపునీటిలో రావాల్సిందే. ఈ నేపథ్యంలో పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

మార్టూరు, జూలై 16 : మార్టూరు పోలీస్ స్టేషన్ సమీపంలో రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించారని ఏఐకేఎస్ నాయకులు మహమ్మద్ బాషా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి ఆర్‌డీవోకు విచారణ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మార్టూరు, జూలై 16 : రైతుల సమస్యలపై ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం రైతు సంఘాల నాయకులు సమావేశమయ్యారు. పేర్ని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ కాల్వలు మరమ్మతు చేయాలని, మట్టి పేరుకొనిపోవడంతోపాటు ముళ్లచెట్లుపెరిగి నీటి ప్రవాహం ముందుకుపారడం లేదని నాయకులు అన్నారు. కూరగాయల మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం చేపట్టాలని, గన్నవరం రోడ్‌లో వ్యవసాయశాఖకు చెందిన స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతు సంఘం మండల అడ్‌హాక్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి,శేషాద్రి, మోహనరావు పాల్గొన్నారు.

21న ఉచిత మెగా వైద్య శిబిరం

చినగంజాం, జూలై 16 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ భరత్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి, ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సూచనల మేరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని, పేదలు వినియోగించుకోవాలని కోరారు. గుండె వైద్య నిపుణులు, మెదడు, నరాలు, జనరల్, ఊపిరితిత్తులు, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారని డాక్టర్ భరత్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మీటర్ రీడర్స్

ఇంకొల్లు, జూలై 16 : సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కరెంటు మీటర్ రీడర్స్ జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా మీటర్ రీడర్స్ అధ్యక్షుడు కె.రత్నరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి కుంచాల సిద్దయ్య, జిల్లా కోశాధికారి సాజిద్దు, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ విజయకుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విజయకుమార్ మీటర్ రీడర్స్‌కు హామీ ఇచ్చారు.

'పొలం పిలుస్తుంది'ని విజయవంతం చేయాలి


పర్చూరు, జూలై 1: పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడీఏ ఎస్.మోహనరావు కోరారు. మండళవారం రైతు భరోసా కేంద్రంలో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ఆర్‌ఎస్‌కే, వీఏఏ, వీహెచ్‌ఏ, ఎంపీఈవోలతో ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్న పొలంపిలుస్తుంది కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం క్రాఫ్ ఇన్స్యూరెన్స్, పీఎం కిసాన్ గురించి వివరించారు. సమావేశంలో పర్చూరు, కారంచేడు, యద్దనూడి ఇంకొల్లు మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, జూలై 16 : ఇంకొల్లులో మంగళవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన వంకాయలపాటి ఆదినారాయణ మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ ఆసుపత్రి వైద్యులు నేత్రాలు సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు శేషయ్య, నాగపూర్ణిమ, శాంతకుమారి, ఆదిత్య, చందనను కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి క్లబ్ అధ్యక్షకార్యదర్శులు రఫి, సాంబశివరావు అభినందించారు.

రోడ్డుపైనే మురుగు నీరు

- నడవలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ప్రాంతాలు



రోడ్డుపై మురుగునీరు

మేదరమెట్ల , జూలై 16 : సైడు కాలువలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులపై బయటకు వచ్చే గృహిణీలు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, కూలీలు, రైతులు మురుగు నీటిలో నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మేదరమెట్ల పేరుకు మేజరు పంచాయతీయేగాని కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రోడ్లు, మురుగు కాలువలు, సాయంత్ర సమయంలో కాసేపు కూర్చొనేందుకు పార్కు వంటి సరైన సౌకర్యాలు లేవు. రోడ్ల వెంబడి వేసిన చెత్త చెదారాన్ని తొలగించడానికి మూడు నాలుగు రోజులు పడుతుంది. దీంతో రోడ్లపై చెత్తను కుక్కలు, పందులు చెల్లాచెదురుగా చేస్తున్నాయి. దానిని నుంచి వచ్చే కంపును భరించలేని పరిస్థితి ఉంది. మిద్దెలడొంకలో సీసీ రోడ్డు నిర్మించిన ఆది మెటల్ రోడ్డు కన్నా దారుణంగా గోతులతో ఉంది. ఈ రోడ్డు నిర్మాణ సమయంలోనే అధ్వానంగా నిర్మించడంతో ఇది కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డా.. మెటల్ రోడ్డా అన్న అనుమానం వస్తోంది. ఈ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో ఎక్కడికి అక్కడ మురుగునీరు నిలిచి ఆ మురుగునీరు రోడ్లపై నిలుస్తుంది. ఎక్కువగా మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కనీసం మురుగు నీరు పారే విధంగా చర్యలు చేపట్టక పోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తతో ఎక్కడికి అక్కడ నీరు నిలిచి పోతుంది. గ్రామంలో ఎక్కువ శాతం సిమెంట్ రోడ్లు నిర్మించిన నాణ్యాతతో నిర్మించకపోవడం వలన రోడ్లపైనే నీరు నిలువ ఉంటుంది. చాలా రోడ్ల వెంట మురుగు కాలువలు నిర్మించకపోవడం వలన మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. వర్షాకాలం వస్తున్నందున్న పంచాయతీ అధికారులు మురగుకాలువలు నిర్మించాలని, కాలువల్లో మురుగు పారేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మిద్దెలడొంక సిమెంట్ రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న రోటరీ సభ్యులు

తల్లి ఆరోగ్యంతోనే బిడ్డ సురక్షితం

అద్దంకిటౌన్, జూలై 16 : తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ సురక్షితంగా ఉంటుందని, గర్భిణులు మంచి ఆహారం తీసుకోవాలని డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో స్థానిక గాజులపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మాతాశిశు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయసింహ మాట్లాడుతు గర్భినులు క్రమం తప్పకుండా వైద్యుని సలహాలు, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటిస్తూ మందులను తీసుకోవాలన్నారు. రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా 40 మంది గర్భిణులకు పౌష్టికాహార ప్యాకెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ సీహెచ్ మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, లేవి ప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి, డాక్టర్ దేవపాలన, రామకోటేశ్వరరావు, శ్రీరామచంద్రమూర్తి, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న న్యాయవాది షేక్ మహమ్మద్ రఫీ

అద్దంకిటౌన్, జూలై 16 : ప్రజలు, విద్యార్థులందరూ చట్టాలపై అవగాహన కలిగి సత్ప్రవర్తనతో మెలగాలని న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, గొట్టిపాటి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అంతర్జాతీయ లా దినోత్సవం సందర్భంగా స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు సివిల్, క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ చట్టాలపై న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావు, క్రిమినల్ చట్టాలపై షేక్ మహమ్మద్ రఫీ అవగాహన కల్పించారు. న్యాయవ్యవస్థ ప్రజలందరికీ సమ న్యాయం అందిస్తుందని, చట్టం ముందు అందరూ సమానమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మద్దుమాల కోటేశ్వరరావు, మార్టూరు రోటరీ సెక్రటరీ సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, లేవి ప్రసాద్, అధ్యాపకులు అశోక్ కుమార్, శిఖామణి, దాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో పొంచి ఉన్న కేన్సర్ ముప్పు

చినగంజాం, జూలై 16 : భవిష్యత్‌లో కరోనా కన్నా ఎక్కువ మంది కేన్సర్ బాధితులు పెరగనున్నట్లు చీరాల ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ జి.రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎల్ఐసీ లైఫ్ ప్లస్ కార్యాలయంలో ఎల్ఐసీ అభివృద్ధి అధికారి జి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కేన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కోరారు. వైద్య ఖర్చులు తట్టుకోవాలంటే కేన్సర్ కవర్ బీమా పాలసీని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఏజెంట్ దార్ల శ్రీనివాసరావు భార్య సత్యవేదం ఇటీవల కేన్సర్‌తో మృతి చెందగా ఆ కుటుంబానికి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జీఆర్ సంవృద్ధి జట్టు సేకరించిన రూ.5,500ను ఎల్ఐసీ మేనేజర్ అందజేశారు.

ముందు రిక్వెస్ట్..తర్వాత పనిష్మెంటే..!

- ప్రజల పక్షాన ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలి
- మున్సిపల్ సమీక్షలో ఎమ్మెల్యే కొండయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 16 : ప్రజాప్రతినిధులైనా, అధికారులైనా ప్రజల పక్షాన, జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులు, వార్డు సెక్రటరీలతో పలువురు కౌన్సిలర్లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా అందరికీ రిక్వెస్ట్‌గా చెప్తా.. వినకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గతంలో ఏం జరిగిందో అనవసరమని, ఇకపై అంకితభావంతో అందరం పనిచేయాలని కోరారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడాలని, స్వీపర్ నుంచి కమిషనర్ వరకూ కలిసి పనిచేయాలని సూచించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో ఉన్న కమిషనర్, కొందరు ఉద్యోగులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ మా ఫెక్లీలు కూడా తొలగించారని గుర్తు చేశారు. కాలం ఎప్పుడు ఒకే మాదిరిగా ఉండదని అప్పుడే వారికి సున్నితంగా చెప్పానన్నారు. మున్ముందు అందరూ బాధ్యతతో పనిచేస్తారని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కొండయ్యను అధికారులు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

జనసే, బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 16 : సమష్టి కృషి.. సత్ఫలితాలు సాధించడమే ధ్యేయంగా అడుగులు వేద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. రోటరీ కమ్యూనిటీ హాలులో మంగళవారం బీజేపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా నేత ఆలా అనిల్, బీజేపీ నాయకులు, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, మువ్వల వెంకటరమణారావు తదితరులు కొండయ్యకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ అభివృద్ధిలో రాజకీయాలు చూడొద్దు. ఆపన్నులకు అండగా ఉందాం. ప్రశాంత వాతావరణం, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో నిరంతరం మనకు మనమే పోటీగా ఉందామని స్పష్టం చేశారు. ప్రధానంగా నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పలువురు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై స్పందిస్తూ ప్రాధాన్యతాక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సత్కరించారు. ముందుగా జరిగిన చిన్నారుల నృత్యప్రదర్శన అందరికీ ఆకట్టుకుంది. వారికి ఎమ్మెల్యే కొండయ్య జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

క్లాస్ రూం కథలు పుస్తకావిష్కరణ

ఇంకొల్లు, జూలై 16 : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన క్లాస్‌రూం కథలు బాలల కథా సంపుటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. మొత్తం 60 పుస్తకాలు రచించగా క్లాస్‌రూం కథల రచనకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ పురస్కారం అందినట్లు రచయిత రాణీప్రసాద్ తెలిపారు. అనంతరం రాణీప్రసాద్ దంపతులను డాక్టర్ కందేపి ప్రసాదరావు, సునీల్, శ్యాం, ఉపాధ్యాయ సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, జూలై 16 : అద్దంకి పట్టణంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు, విద్యుత్ లైన్‌లు వేస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8గంటల నుంచి టెలిఫోన్ ఎక్చేంజీ, నాగులపాడు రోడ్డు, 12, 4వ వార్డులో కరెంట్ ఉండదని ఏఈ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.



అనిల్‌కు వినతిపత్రం అందిస్తున్న జనసేన పార్టీ కార్యకర్తలు

శ్మశానవాటికకు ప్రహరీని నిర్మించాలి

జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా ప్రోగ్రాం కన్వీనర్‌కు వినతి

చీరాల, జూలై 16 : వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ మంకెనవారిపాలెంలోని శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ గోడను నిర్మించాలని జనసేన పార్టీ కార్యకర్తలు ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్రా ప్రోగ్రామ్ కన్వీనర్ ఆలా అనిల్‌కు వినితిపత్రం అంజేశారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు సంబంధించి చీరాల నియోజవకర్గ పరిశీలకునిగా వచ్చిన ఆలా అనిల్‌కు వారు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లి కచ్చితంగా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఆర్‌కే నాయుడు, నూతక్కి రాజేష్, పసుపులేటి సాయి, తోట అశోక్‌చక్రవర్తి పాల్గొన్నారు.

గంగపుత్రుల గొంతెండుతోంది..!

- గోడు పట్టించుకోవాలని గగ్గోలు
- సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం

వాడరేవు (చీరాలటౌన్), జూలై 16 : చీరాల పరిధిలో పర్యాటక కేంద్రమైన వాడరేవు గ్రామంలోని గంగపుత్రులకు తాగునీరు లేక గొంతెండుతోంది. గ్రామంలో సుమారు 3వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు నివాసమున్నాయి. సముద్రతీర ప్రాంతం కావడంతో ఈ ప్రాంత వాసులకు తాగునీరు అందని ద్రాక్షగానే ఉంది. ఇదిలా ఉంటే పంచాయతీ అధికారులు గ్రామంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. కొద్దికాలం అరకొరగానే నడిచింది. గత నాలుగు మాసాలుగా పూర్తిగా మరమ్మతులకు గురై మూలనపడింది. దీంతో ప్రజలు ప్రైవేటు వ్యక్తుల వాహనాల ద్వారా తెచ్చే నీటిపై ఆధారపడ్డారు. ఒక వేళ వారు సకాలంలో రాకపోతే వీరి పరిస్థితి ఊహించలేనిది. అంతేకాకుండా నివాసాల్లోని యువకులు, పురుషులు వేటకు వెళ్లి ఒక్కోసారి వారం రోజుల పాటు సముద్రంలోనే ఉంటారు. ఈసమయంలో ఇంట్లో ఉన్న వృద్ధులు, మహిళలు తాగునీరు కోసం పాట్లు పడుతున్నారు. మరోవైపు గ్రామంలో అధిక శాతం రోడ్లు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు గుంతలమయం. పైగా వీధి దీపాలు కూడా పూర్తిగా లేవు. ఈక్రమంలో రాత్రి సమయాల్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య లోపం మెండుగానే ఉంది. చెత్త సేకరణలో అధికారులకు చిత్తశుద్ధి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల వెంబడి చెత్త పేరుకు పోయి కంపుకొడుతోంది. దీంతో గ్రామస్థులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కూడా దుర్గంధాలు దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి తాగునీరు లేక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోలేకపోవడంపై అనుమానాలు గుప్పిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు కల్పించి ఆదరించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం



పంచాయతీకి చెందిన ఆర్వో ప్లాంట్ మూలన పడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో తాగేందుకు నీరు లేక గ్రామంలో పెద్ద చిన్న తేడా లేకుండా అందరం చాలా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు గ్రామస్థులకు తాగు నీరు అందించాలి.

- అప్పన్న, స్థానిక మత్స్యకారుడు




మూతపడిన వాడరేవు పంచాయతీ ఆర్వో ప్లాంట్

సమస్యలను పరిష్కరించాలి



గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవు. వీధి దీపాలు అరకొరగానే ఉన్నాయి. పారిశుధ్య లోపం ఉంది. చెత్త సేకరణ సమస్య చాలా ఉంది. ప్రధాన రహదారులు మినహా వీధుల్లోకి కార్మికులు రావడం లేదు. దీంతో గ్రామంలో సమస్యల వలయంగా మారింది. అధికారులు సమస్యలను పరిష్కరించారు.

- రాజేష్, మత్స్యకారుడు



జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (విద్య) : జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు తీసుకున్న ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు నేషనల్‌అవార్డ్స్ టూ టీచర్స్ డాట్ ఎడ్యుకేషన్ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించి అందులోని సూచనలు పాటించాలని సూచించారు. ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు వివరాలన్నీ నమోదు చేయాలని తెలిపారు.



దేశంలో మనం ఏ ప్రాంతానికి వెళ్లినా.. ప్రార్థనా మందిరాలకు వెళ్లినా.. మన ప్రాంతం పేరు, మతం పేరు చెప్పుకుంటాం. కానీ, సింహపురి గడ్డపై ఉన్న బారాషహీద్ దర్గాలో మాత్రం ఎవరూ ఎవరినీ మీ మతమేంటి, కులం ఏమిటని అడగరు. అందరిదీ ఒకే మతం.. అదే వరాల మతం.

అవును...

మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం నెలలో నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు బారాషహీద్ దర్గా ముస్తాబయ్యింది. బుధవారం నుంచి ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలిరానుంది. కోర్కెలు తీరి కొందరు.. కొత్త కోర్కెల కోసం మరికొందరు.. తొలిసారిగా వచ్చేవారు ఇలా ఎంతో మంది దర్గాకు చేరుకుని వరాల రొట్టెను అందుకుంటారు. ఏడాదికేడాది భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రపండుగగా గుర్తించింది. అంతటి విశిష్టత గల పండుగకు ఘన చరిత్రే ఉంది.







• ఐదు రోజుల పండుగ ఇలా..

రొట్టెలపండుగను ఐదు రోజులపాటు నిర్వహిస్తారు. బుధవారం ప్రారంభమయ్యే పండుగలో తొలిరోజున సందన్‌మాలీ, 18న అర్ధరాత్రి గంధ మహోత్సవం, 19న రొట్టెలపండుగ, 20 తహలీల్ ఫాతీహ, 21న ముగింపు ఉత్సవాలు ఉంటాయి. అయితే, పేరుకు ఐదు రోజుల పండుగే అయినా మొహర్రం నెల మొత్తం హిందూ ముస్లింలు దర్గాకు వస్తుంటారు. తొలుత స్వర్ణాల చెరువులో స్నానమాచరించి, రొట్టెలు మార్చుకుంటారు. ఆ తర్వాత బారాషహీద్‌లను దర్శనం చేసుకుంటారు.

• ఎన్నో రకాల రొట్టెలు

ఎంతో పవిత్రంగా భావించే రొట్టెల్లో సంవత్సరాలు గడిచే కొద్దీ రకరకాల రొట్టెలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, విద్యా, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, సంతానం, భాగ్యం, ఇల్లు ఇలా ఎన్నో రకాల రొట్టెలు భక్తులకు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రొట్టెల ప్రసాదం ద్వారా కోర్కె తీరిన భక్తులు మరుసటి ఏడాది విధిగా ఈ పండుగకు వచ్చి వారి చేతుల మీదుగా మరొకరికి రొట్టెను పంచడం, కోర్కెల సాధన కోసం ఆ రొట్టెను మహాప్రసాదంగా స్వీకరించడం ఈ పండుగ విశేషం.

కోరికల పండుగకు రారండహో!

మతసామరస్యానికి ప్రతీకగా రొట్టెల పండుగ • ఆర్కాడు నవాబు హయాంలో ప్రారంభం • ఏటా పెరుగుతున్న భక్తజనం • ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

సుమారు 400 ఏళ్ల క్రితం సమాజ శ్రేయస్సు కోసం సౌది, మక్కా షరీఫ్ నుంచి 300 మంది మత ప్రచారకులు (తుర్‌ఖిస్తాన్లు) భారత్‌కు వచ్చారు. ఆ సమయంలో కర్నాటకలో హైదర్ అలీ పాలన, నెల్లూరులో నవాబు పాలన ఉండేది. ఇస్లాం మత ప్రచారం కోసం తుర్‌ఖిస్తాన్లు జిల్లాలో పర్యటిస్తూ కొడవలూరు మండలం గండవరం చేరుకున్నారు. అప్పుడే బ్రిటీష్ సైనికులకు తుర్‌ఖిస్తాన్లకు జరిగిన యుద్ధంలో 12 మంది తుర్‌ఖిస్తాన్లు ప్రాణత్యాగం చేశారు. అలా ప్రాణత్యాగం చేసిన 12 మంది తలలు గండవరం వద్ద పడిపోగా మొండేలతో గుర్రాలు నెల్లూరుకి చేరాయి. ఇలా చేరిన ఈ మొండేలను స్థానికులు స్వర్ణాల చెరువు వద్ద సమాధి చేశారు.

• ఆర్కాడు నవాబు కాలం నుంచి..

1757లో ఆర్కాడు నవాబు ఈ పండుగను ప్రారంభించారు. చెరువులో రజక దంపతులు దుస్తులు ఉతికిన తర్వాత ఓ చెట్టు కింద సేద తీరుతారు. ఆ సమయంలో రజకుడి భార్యకు ఓ దైవదూత కలలోకి వచ్చి.. బారాషహీద్‌ల సమాధుల వద్ద ఉన్న మట్టిని లేపనం చేసుకుంటే అనారోగ్యం నుంచి కోలుకుంటారని చెబుతారు. వెంటనే మేల్కొన్న ఆ మహిళ తన కల గురించి భర్తకు చెబుతుంది. అక్కడే ఉన్న రాజభటులకు జరిగిన విషమం చెబుతారు. అనారోగ్యంతో బాధపడుతున్న నవాబు కుమార్తె బాగు కోసం ఆయన చేయని ప్రయత్నం లేదు. ఈ తరుణంలోనే భటులతో వెళ్లిన రజకుల దంపతుల మాటలను నవాబు విశ్వసిస్తారు. అలాగే చేశారు. అంతే.. ఒక రోజు గడవకముందే కుమార్తె ఆరోగ్యం బాగుపడటం చూసి నవాబు ఆశ్చర్యపోతారు. దీనికి కృతజ్ఞతగా బారాషహీద్ సమాధుల వద్దకు చేరుకుని పూజలు చేస్తారు. సమాధుల మట్టితో లేపనం చేసుకోవడం వల్లే నవాబు కుమార్తె ఆరోగ్యం బాగుపడిందని ప్రజలకూ తెలియడంతో అందరూ దర్గాలో పూజలు చేయడం ఆరంభించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో బారాషాహీదులకు పూజలు చేయడం ప్రారంభించారు.

• హిందువులు పెట్టిన పేరే..

దర్గాలో పూజలు చేసేందుకు సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ వెంట తెచ్చుకున్న రొట్టెలను తిని, మిగిలిన రొట్టెను అక్కడే ఉన్నవారికి పంచేవారు. అలా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు తినడం.. పక్కవారికి ఇవ్వడం ద్వారా రొట్టెల పండుగగా జరుగుతోంది. నవాబు పాలనలో ఆయన ప్రతినిధిగా ఖాజీ ఆధ్వర్యంలో పండుగ జరిగేది. అయితే, ముస్లింలు ఈ పండుగను 'మొహర్రం జియారత్' అని పిలుచుకునేవారు. చెరువు వద్ద రొట్టెలు మార్చుకోవడం ద్వారా రొట్టెలపండుగగా పిలుస్తున్నారు. ఇది హిందువులే నామకరణం చేయడం గర్వంగా ఉందని దర్గా సంరక్షకులు చెబుతున్నారు. అలా మొదలైన రొట్టెల పండుగ జిల్లా సరిహద్దులు దాటి విదేశాలకూ పాకింది. ప్రస్తుతం లక్షల మంది భక్తులు ఈ పండుగలో పాల్గొంటున్నారు. అందుకే 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి వేడుకలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత తొలిసారిగా దర్గా వద్ద రొట్టెల పండుగ జరుగుతుండటంతో ప్రజాప్రతినిధులు కూడా అట్టహాసంగా నిర్వహించాలని సిద్ధమయ్యారు. దర్గా వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్నా పండుగ నిర్వహణ మాత్రం నగర పాలక సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ ఏడాది పారిశుధ్యం, మంచినీరు, ప్రైవేట్ కూలీలు, చెత్తతర లింపునకు ప్రైవేట్ వాహనాలు, భోజనాలు తదితర అంశాలతో కూడిన 41 పనులకుగాను కార్పొరేషన్ రూ.4 కోట్ల వరకు నిధులు కేటాయించింది.

• తరలిరానున్న భక్తజనం

రొట్టెల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వ ప్రతినిధిగా కలెక్టర్ ఓ ఆనంద్ పర్యవేక్షణలో 25 శాఖల అధికారులు పండుగ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు పది లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. ఆ మేరకు జిల్లా యంత్రాంగం భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా చర్యలు, పార్కింగ్ ప్రదేశాలు, వైద్య శిబిరాలు సిద్ధం చేసింది. భద్రత పరిరక్షణ కోసం వేలాది మంది పోలీసులతోపాటు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు.

• అతిథులుగా భావిస్తూ...

రొట్టెల పండుగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను నెల్లూరు నగరవాసులు అతిథులుగా భావించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, యువకులు తరలివచ్చి అన్నదానం, మజ్జిగ, చలివేంద్రం, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. భక్తులకు వీలుగా బస్టాండు, రైల్వేస్టేషన్ నుంచి ఉచిత వాహనాలనూ సమకూరుస్తారు.

- నెల్లూరు (సాంస్కృతికం)





స్వర్ణాల చెరువు ఘాట్‌లో భక్తజనం

2వేల మందితో బందోబస్తు



నెల్లూరు (క్రైం) : రొట్టెల పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ జీ కృష్ణకాంత్ 2వేల మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాతోపాటు ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన సిబ్బందికి పోలీసు కవాతు మైదానంలో ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 48 మంది సీఐలు, 127 మంది ఎస్ఐ లు, 278 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 832 మంది కానిస్టేబుళ్లు, 96 మంది ఉమెన్ కానిస్టేబుళ్లు, 282 మంది హోంగార్డులు, 49 మంది మహిళా హోంగార్డులతోపాటు ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బందిని బందోబ స్తుకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగలో ప్రధాన భూమిక అయిన గంధ మహోత్సవం రోజు మరింత పటిష్టంగా విధులు నిర్వహించాలని సూచించారు. దర్గా పరిసర ప్రాంతాల్లో డ్రోన్, 52 సీసీ కెమెరాల నిఘా నీడలో 24 గంటలపాటు కంట్రోల్ రూమ్ పర్య వేక్షణ ఉంటుందన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అందరూ సమయ పాలన పాటిస్తూ ఐడీ కార్డు, విజిల్, రెయిన్ కోట్, డ్యూటీ పాస్ పోర్టులతో విధులకు హాజరు కావాలని సూచించారు. ఎవరైనా విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, విధులకు గైర్హాజరైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

5,088 మంది పారిశుధ్య కార్మికులు

నెల్లూరు (సిటీ) : బారాషహీద్ దర్గాలో 5,088 మంది కార్మికులతో పారిశుధ్య నిర్వహణ చేపట్టినట్లు ఎంహెచ్‌వో వెంకటరమణయ్య తెలిపారు. ఈ మేరకు క్లస్టర్ల వారీగా కార్మిలకు విధులు కేటాయించినట్లు తెలిపారు. నలుగురు సూపర్‌వైజర్లు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 66 కార్యదర్శులను నియమించామన్నారు. కాగ వాహన పార్కింగ్ ప్రాంతాలలో మొబైల్ టాయిలెట్స్‌తోపాటు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

అగ్నిమాపక దళం సన్నద్ధం

నెల్లూరు (క్రైం) : రొట్టెల పండుగలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అగ్ని మాపక శాఖ సిద్ధంగా ఉందని డీఎఫ్‌వో శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. డీఎఫ్‌వో పర్యవేక్షణలో ఏడీఎఫ్‌వో వేణు గోపాల్ దర్గా ప్రాంగణం వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. దుకాణాల్లో ముందస్తుగా మంటలను ఆర్పే పరికరాల ఏర్పాటుతోపాటు దుకాణదారులకు అవగాహన కల్పించారు. స్వర్ణాల చెరువు ఘాట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పంపు సెట్లను ఏర్పాటు చేశారు. రెండు ఐఆర్‌బీ బోట్లతోపాటు పది మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. చెరువు వద్ద అగ్నిమాపక శాఖ ఔట్ పోస్టును ఏర్పాటు చేసి, 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారు. నాలుగు ఫైర్ ఇంజన్లు, మిస్ట్ బులెట్, పది పోర్టబుల్ పంపు సెట్లు, రెండు ఐఆర్‌బీ బోట్లు, 40 మంది ఎక్స్‌టింగ్విషర్స్, 15 లైఫ్ జాకెట్లు, 15 రోప్‌లు ఇలా అనేక పరికరాలను అందుబాటులో ఉంచారు. జిల్లాతోపాటు ప్రకాశం, అన్నమయ్య, బాపట్ల, గుంటూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాలకు చెందిన 128 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక శాఖ ఔట్ పోస్ట్ వద్ద అగ్నిమాపక శాఖ అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

'చుక్క'లు చూపిస్తున్నారు!

అమలుకాని స్ర్కూటినీ కమిటీ ఆదేశాలు

నేటికీ వేలాది ఎకరాలు నిషేధిత జాబితాలోనే

బ్యాంకుల తనఖాల్లోంచి విడిపించేందుకు రిజిస్ట్రేషన్ అధికారుల ససేమిరా

ఇదెక్కడి చోద్యమని తలపట్టుకుంటున్న రైతులు



ఈయన పేరు కాకుమాని మాధవరావు. గుడ్లూరు మండలం దారకానిపాడువాసి. తనకున్న భూముల్లో 8.76 ఎకరాలను 2021లో కందుకూరు యూనియన్ బ్యాంకులో తనఖాపెట్టి రూ.24 లక్షల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణం చెల్లించి తనఖా నుంచి భూమిని విడిపించుకు నేందుకు కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా కుదరదని సబ్ రిజిస్ట్రార్ చెప్పడంతో అవాక్కయ్యాడు. తనఖాపెట్టిన 8.76 ఎకరాలలో సర్వే నెం. 223-2, 225-3సీ, 226-1బీలలో కలిపి 0.88 సెంట్లు ప్రభుత్వ భూమి గా నిషేధిత జాబితా లో ఉండటం వల్ల కుదరదని సమాధానమిచ్చారు. అయినా తాను తనఖా నుంచి విడిపిస్తున్నానని, నిజంగా ప్రభుత్వ భూమే అయినా ప్రభుత్వానికే మంచిది కదా.. పోనీ ఆ మూడు నెంబర్లు వదిలేసి మిగిలిన భూమిని విడుదల చేయండని ప్రాధేయపడినా ససేమీరా అన్నారు. తీరా చూస్తే ఆ 3 సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో పొరపాటున చేరినందున వాటిని తొలగించాలని జిల్లాస్థాయి స్ర్కూటినీ కమిటీ 2023 నవంబరు 30న ఆదేశాలు జారీచేసి ఉంది. కలెక్టరు అధ్యక్షతన ఏర్పడిన స్ర్కూటినీ కమిటీ సిఫార్సు చేసి ఏడు నెలలు గడిచినా అమలుకాలేదు. దీంతో అప్పు చెల్లించి కూడా తన భూమిని తనఖా నుంచి విడిపించుకోలేని దుస్థితి మాధవరావుది.

కందుకూరుకు చెందిన చేబ్రోలు శ్రీనివాసరావుకు వలేటివారిపాలెం మండలం కూనిపాలెంలో సర్వే నెం. 360-ఏ1లో 8 ఎకరాల భూమి ఉంది. ఈయన కూడా తన భూమిని ఆరేళ్ల క్రితం కందుకూరులోని ఓ జాతీయ బ్యాంకులో తనఖాపెట్టి దీర్ఘకాలిక రుణం తీసుకున్నాడు. ప్రస్తుతం రుణం పూర్తిగా చెల్లించి తన ఆస్తికి తనఖా నుంచి విడిపించుకునేందుకు బ్యాంకు అధికారులను తీసుకుని వెళ్లగా 'మీ భూమి నిషేధిత జాబితాలో ఉంది. విడిపించడం కుదరద'ని సబ్ రిజిస్ట్రార్ సెలవిచ్చారు. తీరా విచారిస్తే శ్రీనివాసరావు ఆ భూమిని బ్యాంకులో తనఖా పెట్టాక రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల ఈ భూమి 22 (1ఏ) నిషేధిత జాబితాలో పడగా గత సంవత్సరం నవంబరులో జిల్లా స్థాయి స్ర్కూటినీ కమిటీ పొరపాటుని సరిచేస్తూ 360-ఏ1 సర్వే నెంబరును నిషేధిత జాబితా నుంచి తొలగించమని సిఫార్సు చేసింది. అయినా ఫలితం లేదు.



కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కందుకూరు : ఈ సమస్య ఈ ఇద్దరు రైతులదే కాదు. కందు కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఎంతోమంది రైతులు ఇదే సమస్యతో బాధపడుతూ కాళ్లరిగేలా తిరుగుతున్న దుస్థితి. చుక్కల భూములన్నిటినీ నిషేధిత జాబితాలో పెట్టడం ఒక సమస్య అయితే, ఎలాంటి సమస్యా లేని పట్టా భూములను కూడా రెవెన్యూ అధికారులు పొరపాటున ఆ జాబితాలో చేర్చడం మరో సమస్యకు కారణమైంది. ఇక తొలివిడత రీ సర్వేకు ఎంపికైన గ్రామాల రైతులైతే రీసర్వేలో జరిగిన తప్పుల తడకల వల్ల అనేక పట్టాభూములు ప్రభుత్వ భూములుగా నమోదై ఇబ్బంది పడుతున్నారు. చుక్కల భూముల సమస్య పరిష్కారం కోసం 2023లో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఆయా రెవెన్యూ డివిజన్లలోని సబ్ కలెక్టర్లు లేదా ఆర్డీఓలు, ఆయా మండలాల తహసీల్దార్లతో జిల్లాస్థాయి స్ర్కూటినీ కమిటీ లను ఏర్పాటుచేసి నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల్లో ఆ జాబితా నుంచి తొలగించాల్సిన సర్వే నెంబర్లు, భూ విస్తీర్ణాలతో సహా స్పష్టంగా పేర్కొంటూ ఉత్తర్వులిచ్చారు. గుడ్లూరు మండలం దారకానిపాడుకు సంబంధించి 2023 మార్చి 31న ప్రభుత్వం జీవో నెం. 163ను జారీచేసింది. రైతులకు చెందిన చుక్కల భూములను గుర్తించి వాటిని నిషేధిత జాబితాల నుంచి తొలగిం చేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలనేది ఆ జీఓ సారాంశం. దీంతో జిల్లావ్యాప్తంగా చుక్కల భూముల సమస్యపై కసరత్తు జరగ్గా ఆయా మండలాల తహసీల్దార్లు గ్రామాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించి రైతుల స్వాధీనానుభవంలో ఉండి, పత్రాలు కలిగిఉన్న భూములను గుర్తించి నిషేధిత జాబితాల నుంచి తొలగించేందుకు అవకాశం ఉన్న భూములను సిఫార్సు చేశారు. ఇలా దారకానిపాడు గ్రామంలో 329.35 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు 7-10-2023న గుడ్లూరు తహసీల్దారు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఆ నివేదికపై మరోసారి విచారణ జరిపి 6-10-2023 న అప్పటి కందుకూరు సబ్ కలెక్టరు ఎస్ఎస్ శోభిక జిల్లా కలెక్టరుకు నివేదించారు. అనంతరం 30-11-2023 జిల్లాస్థాయి స్ర్కూటినీ కమిటీ ఆ భూములన్నిటినీ నిషేధిత జాబితా నుంచి తొలగించమని ఆదేశాలు జారీచే శారు. జిల్లా వ్యాప్తంగా చూస్తే 37 మండ లాల్లోని 322 గ్రామాలలో ఉన్న వేలాది ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సిఫార్సు చేసి ఉన్నారు. కానీ నేటికీ ఆ ఆదేశాలు అమలు కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనే యులును వివరణ కోరగా 'ఇలాంటి సమ స్య ఉన్న రైతులకు తాము ఎందుకు మార్టి గేజ్ రిలీజ్ చేయలేక పోతున్నామో లిఖిత పూర్వకంగా ఇస్తామని, దాని ఆధారంగా కలెక్టరు నుంచి క్లియరెన్స్ తెచ్చుకుంటే నిషేధిత జాబితా నుంచి తొలగించి మార్టిగేజ్ రిలీజ్ చేస్తాము.' అని అన్నారు.

రేషన్ గోదాము తనిఖీ

సంగం, జూలై 16: జండాదిబ్బలోని రేషన్ గోడౌన్‌ను మంగళవారం తహసీల్దారు రమాదేవి తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రేషన్ దుకాణాలకు సరుకులను సకాలంలో తరలించాలన్నారు. తూకాల్లో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట రాజనారాయణ, వీఆర్వో ఉన్నారు.

అనంతసాగరం చెరువు పరిశీలన

అనంతసాగరం, జూలై 16: అనంతసాగరం చెరువు ఒకటి, రెండు నెంబర్ తూములను మంగళవారం స్థానిక రైతులతో కలిసి ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వీలైనంత త్వరగా తూముల మరమ్మతులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ లీలావతి, ఏఈ ఖాదర్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి రూరల్, జూలై 16: స్థానిక నాగులబావివీధి సెంటర్‌లో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. సమీపంలో పీర్ల చావిడి ఉండటంతో యువకులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి తెగిపడిన తీగను సరి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మినిరల్ వాటర్ సరఫరా చేయాలి

ఆత్మకూరు, జూలై 16: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే నీటిశుద్ధి ప్లాంట్‌ను మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్లాంట్‌ను శుద్ధిచేసి సురక్షత జలాలను సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా, వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, షేక్ గౌస్‌బాషా, సూరా భాస్కర్‌రెడ్డి, గందళ్ల వేణు, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, బుజ్జిరెడ్డి, చిన్నపురెడ్డి, షేక్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రంగా పేరు మార్పు

సీతారామపురం, జూలై 16: మండలకేంద్రంలోని బీట్-1 సచివాలయ పరిధిలోని రైతుభరోసా కేంద్రాన్ని అధికారులు మంగళవారం రైతుసేవా కేంద్రంగా పేరు మార్చి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో పీ.చెన్నారెడ్డి మాట్లాడుతూ అన్ని ఆర్‌బీకేలను రైతుసేవా కేంద్రాలుగా మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ఉదయగిరి, జూలై 16: స్థానిక గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన మంగళవారం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఆరోగ్యసహాయకులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వరకు సర్వే నిర్వహించి వివరాలు అందించాలన్నారు.

గండిపాళెం పీహెచ్‌సీలో కాన్పు

ఉదయగిరి రూరల్, జూలై 16: గండిపాళెం పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కొన్నేళ్లుగా పీహెచ్‌సీలో కాన్పులు జరిగిన దాఖలాల్లేవు. ఆస్పత్రి వైద్యులుగా బాధ్యతలు చేపట్టిన శివకల్పన, వినీలు వైద్య సిబ్బందికి సూచనలిస్తూ 24 గంటలు స్టాఫ్ నర్స్, సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ఇటీవల వైద్యశాలలో మూడు కాన్పులు జరగ్గా మంగళవారం వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి గ్రామానికి చెందిన కల్యాణి పురిటినొప్పులతో వైద్యశాలకు రావడంతో స్టాఫ్ నర్సులు ఆమెకు సాధారణ కాన్పు చేశారు. వైద్యశాలలో అన్ని సదుపాయాలు ఉండడంతో కాన్పులు చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో మధులత

ఏఎస్ పేట, జూలై 16: నెల్లూరులోని బరాషాహీద్ దర్గాలో జరిగే రొట్టేల పండుగ సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకార్యలు కల్పించాలని ఆత్మకూరు ఆర్డీవో మధులత తెలిపారు. మంగళవారం ఆమె పేట దర్గా పరిసర ప్రాంతాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. భక్తుల సౌకార్యల గురించి అధికారు లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు రవికుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి, దర్గా ఈవో మహమ్మద్ హాసేన్ పాల్గొన్నారు.

అన్నిఏర్పాట్లు పూర్తి: రొట్టేల పండుగ సందర్బగా ఏఎస్ పేట దర్గాకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా ఈవో మహమ్మద్ హాసేన్ తెలిపారు. ఆర్డీవో మధుతల ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంగం: స్థానిక బ్యారేజి వద్దకు స్నానానికి వచ్చే యాత్రికులకు కోసం ముందస్తు రక్షణ ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దారు రమాదేవి, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బ్యారేజి వద్ద సిబ్బందితో ఆనకట్ట పరిసర ప్రాంతాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటును పరిశీలించారు. రొట్టెల పండుగ జరిగే ఐదురోజులు కాపలా ఉండేట్లు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ బీవీ కృష్ణ ఉన్నారు.

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ఎంజీబీఎస్, జేబీఎస్, బీహెచ్‌ఈఎల్ వెళ్లేందుకు నూతన బస్సు సర్వీసులు బుధవారం నుంచి ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజు రాత్రి 8.30గంటలకు ఉదయగిరి నుంచి బస్సులు బయలు దేరుతాయని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధినేతల చిత్రపటాల బహూకరణ



ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలను అందజేస్తున్న నాయకులు

సీతారామపురం, జూలై 16: టీడీపీ మండల సీనియర్ నాయకుడు ముత్తంశెట్టి చెన్నకేశవులు, తెలుగు యువత నాయకులు ఎడమ ప్రవీణ్ కుమార్ మంగళవారం బాలాయపల్లి సచివాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, కనకద్రి, బ్రహ్మయ్య, సాల్మన్‌రాజు, తిరుపతయ్య, సిబ్బంది మాల్యాద్రి, బాలయ్య, ప్రతాప్, సావిత్రి పాల్గొన్నారు.

కౌలు రైతులకు హక్కు పత్రాల పంపిణీ

సీతారామపురం, జూలై 16: అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో మంగళవారం కౌలు రైతులకు పంటసాగు హక్కుపత్రాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజనుకు మండలానికి 367కార్డులు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు 67కార్డులు మంజూరు చేశామన్నారు. గ్రామసభలతో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కౌలుదారునికి భూమిపై ఎలాంటి హక్కు ఉండదని, వారు కార్డులు పొందుటకు మాత్రమే అర్హులన్నారు. కార్యక్రమంలో వీఆర్వో మురళి, ఎఈవో నారాయణ, వీపీఏ నరేంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రతకే మొదటి ప్రాధాన్యం



కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న కార్మికులు

సీతారామపురం, జూలై 16: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు ఈవోపీఆర్డీ భార్గవి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం సీతారామపురం పంచాయతీలోని బెస్తకాలనీ, కురవ వీధుల్లోని కొళాయిల వద్ద, మురుగు కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అనంతరం డయేరియా నివారణ చర్యల్లో భాగంగా నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

తుమ్మలపెంట గురుకులంలో

చెట్ల కిందే భోజనాలు

- శిథిలావస్థలో డైనింగ్ హాలు
- తిప్ప పాఠశాలలో లోతైన గుంతతో తంటాలు
- పెదపవనిలో వసతి గదులు చాలక ఇక్కట్లు

ఆంధ్రజ్యోతి విజిట్

కావలి రూరల్, జూలై16: మండలంలోని తుమ్మలపెంట గురుకుల పాఠశాలలో డైనింగ్ హాలు శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థినులు చెట్ల కిందే భోజనాలు చేస్తున్న దృశ్యం మంగళవారం ఆంధ్రజ్యోతి కంటపడింది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థినుల కోసం డైనింగ్ హాల్ నిర్మించారు. నాటి డైనింగ్ హాలు భవనం పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి లోకేష్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రూ.60 లక్షలతో డైనింగ్ హాలు నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆ పనులు నిలిపివేశారు. కొత్త ప్రభుత్వ మైనా మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేసి డైనింగ్ హాలును వాడుకలోకి తీసుకురావాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని గురుకుల పాఠశాలను ఆంధ్రజ్యోతి మంగళవారం విజిట్ చేసింది. పాఠశాల ఆవరణంలో లోతైన గుంత ఉందని, దాని వల్ల వర్షాకాలం తీవ్రఇబ్బందిగా ఉందని విద్యార్థినులు తెలిపారు. అధికారులు, దాతలు చొరవ తీసుకుని గుంత పూడ్చించాలని వారు కోరారు.

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో వసతి గదులు చాలక విద్యార్థినులు ఇక్కట్లు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆ పాఠశాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించగా మెనూ ప్రకారం భోజనంలో క్యారెట్ కూర, తోటకూర పప్పు, బాయిల్డ్ కోడి గుడ్డు, పెరుగు వడ్డించారు. అనంతరం పలువురు విద్యార్థినులను ప్రశ్నించగా బాగుందని చెప్పారు. ఈ విద్యాలయంలో ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో దాన్ని ఉపయోగించడం లేదు.దీంతో విద్యార్థినులు ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గదుల వసతి కల్పించాలని వారు కోరుతున్నారు.



తుమ్మలపెంట గురుకులంలో చెట్ల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థినులు



పెదపవని బాలికల గురుకుల పాఠశాలలో శిథిలమైన వసతిగృహం గదులు

కౌలురైతులంతా ధ్రువీకరణ పత్రాలు పొందాలి



కందుకూరు : కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

కందుకూరు, జూలై 16: కౌలు రైతులంతా సాగు ధ్రువీకరణ పత్రాలు పొందటం ద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలకు అర్హులు కావాలని మండల వ్యవసాయాధికారికి వీ రాము సూచించారు. మండలంలోని ఓగూరు రైతు సేవాకేంద్రంలో మంగళవారం కౌలుదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసే ప్రతిరైతు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కే శరత్‌కుమార్, వీఆర్‌వోఏ. శివశంకర్, పంచాయతీ కార్యదర్శి ఎం. నాగదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహం లింకన్ చెప్పారు.మంగళవారం మండలంలోని అన్నెబోయినపల్లి, వీఆర్ కోట గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో వీఆర్‌వోలు అమానుల్లాఖాన్, ప్రసాద్, వీపీఏ షేక్ నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండల పరిధిలోని కొమ్మి, సత్యవోలు, పార్లపల్లి గ్రామాల్లో మంగళవారం కౌలురైతు కార్డుల పంపిణీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తానయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవో ఈశ్వరాచారి, వీపీఏలు బాలక్రిష్ణ, సుమతి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కలిగిరి : కౌలు రైతులు గుర్తింపు కార్డును కలిగిఉంటే ప్రభుత్వం ద్వారా అందే అన్నిరకాల రాయితీలను పొందవచ్చని వ్యవసాయాధికారి ఎంసురేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఆర్వోలు నరేష్, రామకృష్ణ, వీహెచ్‌ఏ రమేష్, వీపీఏ జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన

వలేటివారిపాలెం, జూలై 16: మండలంలోని పోకూరు గ్రామసచివాలయలో మంగళవారం క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపులపై వినియోగదారులకు ఏఈ తాటికొండ మధుబాబు అవగాహన కల్పించారు. వినియోగదారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి సమయం వృథా చేసుకోకుండా, తమ ఫోన్‌లోనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకొని బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొడవలికణ వ్యాధిపై అవగాహన

వలేటివారిపాలెం, జూలై 16: మండలంలోని అత్తింటివారిపాలెంలో మంగళవారం వైద్యఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ కార్యకర్తలు కొడవలికణ వ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ జన్యుపరమైన మార్పుల వల్ల వచ్చే ఈ జబ్బుకు సరైన మందులు లేవని తెలిపారు. నివారణే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ఏఎన్ఎం అనీత, ఎంఎల్‌హెచ్‌పీ మధూషా తదితరులు పాల్గొన్నారు.

యువత అన్నీ రంగాల్లో రాణించాలి

బిట్రగుంట, జూలై 16: యువత అన్ని రంగాల్లో రాణించాలని జనసేన కావలి నియోజకవర్గ నేత సిద్దు అన్నారు. బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్‌లో రెండో స్థానం సాధించిన శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలికలను చదివించడం బాధ్యత

కావలిటౌన్, జూలై16: బాలికలను రక్షించుకోవడం, చదివించుకోవడం సామాజిక బాధ్యతని అల్లూరు ఎంపీడీవో వీ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ సమావేశ మందిరంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణ జరిగింది. సీడీపీవో సౌజన్య పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఏడీపీవో జే శారద, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమ్య, డాక్టర్ మాధవి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీవో ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మన్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న గ్రామస్థులు

గుడ్లూరు, జూలై 16 : మండలంలోని రాళ్లపాడు మన్నేరు రేవు నుంచి, అక్రమంగా తరలిపోతున్న ఇసుక రవాణాను, మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. మూడు రోజుల నుంచి రాత్రి సమయంలో తరలిపోతున్న ఇసుక రవాణా విషయాన్ని గమనించిన గ్రామస్థులు, రవాణాను అడ్డుకొని, రేవులో ఎక్స్‌కవేటర్ పనులను నిలిపివేశారు.ఇసుక తరలింపు విషయమై కందుకూరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టవేయాలని గ్రామస్థులు కోరారు.

కందుకూరులో పోలీసు అధికారుల బదిలీ ?

కందుకూరు, జూలై 16: నియోజకవర్గంలో పోలీసు అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ప్రస్తుతం కందుకూరు, గుడ్లూరు సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారుల్లో ఒక్క ఎస్‌ఐని మినహా అందరినీ బదిలీ చేయాలన్న నిర్ణయానికి అనుగుణంగా రెండుమూడురో జుల్లో బదిలీ ఉత్తర్వులు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఇప్పటికే ఉన్నతాధికారులకు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు వెళ్లగా త్వరలో ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలిసింది.

నేడు జలదంకి మండల సమావేశం

జలదంకి, జూలై16: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. ఎంపీపీ జీ వెంకటరమణయ్య అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. అన్నిశాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరు కావాలని తప్పక రావాలన్నారు.

టిడ్కో గృహ సముదాయాన్ని మహానగరంగా మార్చుతా..



టిడ్కో గృహాల పరిస్థితిని ఎమ్మెల్యే కావ్యకు వివరిస్తున్న ఈఈ ఉమాశంకర్ శాస్త్రి

కావలి, జూలై16: టిడ్కో గృహ సముదాయాన్ని మహానగరంగా మార్చడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని మద్దూరుపాడులో నిర్మించి ఉన్న టిడ్కో గృహసముదాయాన్ని మంగళవారం ఎమ్మెల్యేతోపాటు ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ, టిడ్కో ఈఈ ఉమాశంకర్ శాస్త్రి, తదితరులు పరిశీలించారు. గృహాల్లోకి వెళ్లి అక్కడ నివసిస్తున్న వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్లు, నీటిట్యాంకు, పార్కు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల సముదాయంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, పుష్కలంగా నీరు అందేలా చర్యలు చేపడతానన్నారు. నెలలోపు విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌కు ఇక్కడ బాధ్యతలు అప్పగిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనే ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, టీపీవో బాబూరావు, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, జ్యోతి బాబూరావు, అర్షియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



ఆధార్ ఎన్‌రోల్ పత్రాన్ని లబ్ధిదారునికి అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

కందుకూరు, జూలై 16: పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు చేయాలంటే డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి అయినందున, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆధార్‌కేంద్రాల వద్దే పుట్టినరోజు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయించామన్నారు. ఆధార్ జారీ అయినవారికి అక్కడికక్కడే బ్యాంకర్లు జీరో అకౌంట్ ఓపెన్‌చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. సబ్ కలెక్టరు జీ విద్యాధరి, మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు.

కుష్ఠు వ్యాధి గుర్తింపునకు ప్రత్యేక చర్యలు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అనీల్ కుమార్

కావలి రూరల్, జూలై16: కుష్టువ్యాధి గుర్తింపునకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తుమ్మలపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి అనీల్ కుమార్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో కుష్టువ్యాధి గుర్తింపు, నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి 14 రోజుల పాటు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 28 టీంలతో కుష్టు వ్యాధిపై సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎంవీ సుజాత, పీహెచ్ఎన్ శాంతకుమారి, సూపర్‌వైజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ఈనెల 18 నుంచి ఆగస్టు 2వరకు కుష్టు వ్యాధి నిర్ధారణపై ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలకు స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో లెప్రసీ కేసులను గుర్తించుటకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జీ సునీల్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

బిట్రగుంట : మొహర్రం సందర్భంగా బోగోలు పీర్లచావిడిల వద్ద మంగళవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారు జామున బోగోలు రాజావీధి పీర్ల చావిడిల వద్ద గుండం తొక్కారు.

అధినేతల చిత్రపటాల ఏర్పాటు

జలదంకి : మండలంలోని అన్నవరం సచివాలయంలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినేతల చిత్రపటాలను కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను వీరు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ జీ వెంకటరమణయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోర్నిపాటి మాధవరెడ్డి, పూనూరు రామక్రిష్ణారెడ్డి, ముచ్చాల మనోహర్‌రెడ్డి, నక్కా మాధవరావు, గంటా అశోక్, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.